# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

డి.జె. బాలకృష్ణ లాల్

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 36 సంచిక 12
పేజీలు 40
ఆగస్ట్ 2017

**5సం॥ల చందా రూ. 250**
**2సం॥ల చందా రూ. 120**
**సంవత్సర చందా రూ. 60**
**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ ,
A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

printed and published by
C.V. Ramana Babu
on behalf of
YOGINI SRI CHANDRA
KALI PRASADA MATHAJI
CHARITABLE TRUST
and Printed at
Samardha Sadguru Publications,
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh and
Published at
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh, Editor
DUGGIRALA JAGANMOHANA
BALA KRISHNA LAL


***ఈ సంచికలో*** ............................ ....... **పేజీ**


భద్రవాక్యం ........................................2
శ్రీబాబూజీ ఉవాచ........................................ 4
అమ్మమాట........................................ 7
తపస్సు - ప్రార్థన ........................................9
అంజలి ........................................ 11
ముగ్గురు చింతనాపరులు ........................................12
త్రిపురా రహస్యం ........................................ 15
భగవంతుని సన్నిధికి........................................17
గీతా పండితుని ఆస్తిక్య బుద్ధి ........................................ 18
ముండకోపనిషత్తు ........................................ 20
బహుళాపురం ........................................22
యోగవాశిష్ఠము ........................................ 24
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు........................................26
పరిప్రశ్న ........................................27
భక్తిరేవ గరీయసి ........................................29
శ్రీకృష్ణకర్ణామృతము........................................31
చిన్ముద్ర ........................................33
పరమానందయ్య శిష్యులు ........................................ 35
సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర..... 37
విష్ణు కథలు- మీరాబాయి........................................39

# భద్ర వాక్యం

- పరాశర ప్రసాద్

**స ఏవ మాయా పరిమోహితాత్మా శరీరమాస్థాయ కరోతి సర్వమ్**
**స్త్ర్యన్న పానాది విచిత్ర భోగైః స ఏవ జాగ్రత్పరితృప్తిమేతి ॥**

(కైవల్యోపనిషత్ 12వ శ్లో॥)

మాయ చేత మోహం చెందినవాడై జీవుడు వాసనల ప్రభావం చేత కారణశరీరము, అంతఃకరణ సృష్టింప బడుతున్నాయి. అంతఃకరణలో వాసనలననుసరించి, దానికి తగిన గుణాలు ఆధారంగా ఎటువంటి దేహము కావాలి అనేది నిర్ణయింప బడుతుంది.

అంతఃకరణలోని భావాలననుసరించి ప్రాపంచిక వ్యవహారాలను ఎలా నిర్వహించాలి అనేది నిర్ణయింప బడుతుంది. దానికి తగినట్లుగా పంచభూతాలు, పంచతన్మాత్రల సహాయంతో దేహము, పరిసరాలు సృష్టింపబడతాయి.

ఇక జీవుడు తన ఉపాధి ద్వారా వ్యష్టిగా అవిద్య ప్రభావం చేత విషయ ప్రపంచంలో సమస్త భోగాలను అనుభవిస్తున్నాడు. అయితే వ్యష్టిగా జీవుడిని ప్రకాశింపజేసే జాగృతుడే విశ్వుడు. అయితే జీవుడు తన స్వరూప స్వభావాలను మరచి విషయ ప్రపంచంలో వివిధ భోగాలను అనుభవించి బాహ్యదృష్టితో వ్యవహరిస్తున్నాడు.

జీవుడు పరమాత్మ శక్తితోనే అన్ని అనుభవాలను గుర్తించ గలుగుతాడు. జీవుడిగా సుఖదుఃఖాలను, రాగద్వేషాలను, ఈర్ష్య అసూయలను, కామక్రోధాది గుణాలను భావపూర్వకంగా గుర్తించ గలిగే జాగృతుడే విశ్వుడు.

కాని పరమాత్మకు గుణాలు గాని, గుణప్రేరిత దోషాలుగాని అంటగట్టటం అవివేకం. పరిణామం చెందే ఉపాధికి, సూక్ష్మకారణ దేహాలకు ఆధారంగా ఉన్నాడు. అయితే వ్యష్టిగా ఉపాధికి పరిమితమై నప్పుడు మాత్రం జాగ్రదావస్థలో విశ్వుడుగా పిలువబడుతున్నాడు.

చైతన్యము మాయను స్వీకరించి ఉపాధిలో ప్రవేశించి జీవుడిగా వ్యవహరింప బడుతోందని గ్రహించాలి. వ్యష్టిలో మాయ అవిద్య అని పిలువబడుతోంది. అయితే సమిష్టిలో అదే మాయగా వ్యవహరింప బడుతోంది.

పకృతి జడమైనది. ఆ విషయము అందరికి అవగతమే. దేహ మనో బుద్ధులు ప్రకృతి బద్ధమే అయినప్పటికీ మనము జడముగా లేము. మన అనుభవాన్ని బట్టి చూస్తే మనం చైతన్యవంతులమే కదా! పరమాత్మ యీ ప్రకృతి ద్వారా వ్యవహరించినప్పుడు వ్యక్తమైన రూపమే మనందరిలో ఉన్న జీవాత్మ. అవస్థా భేదాలననుసరించి జాగృత స్వప్న సుషుప్తిలలో అనుభూతులు విభిన్నంగా ఉంటాయి.

అనుభవాలు వేరైనా వాటికి ఆధారమైన పరమాత్మ మాత్రం ఒక్కడే. అయితే అవస్థా భేదాలననుసరించి విశ్వుడు, తైజసుడు, ప్రాజ్ఞుడుగా మనం గుర్తిస్తున్నాము. జాగృతుడు విశ్వుడుగా గుర్తించబడుతున్న విషయం ప్రస్తుతాంశము.

## విన్నపము

సమర్థ సద్గురు తెలుగు మ్యాగజైన్ పాఠకులకు సవినయ విన్నపము

ఇటీవల పేపర్ ఖర్చులు, ప్రింటింగ్ ఖర్చులు విపరీతంగా పెరగటం, వల్ల సమర్థ సద్గురు యాజమాన్యం ఈ క్రింది నిర్ణయాలు తీసుకున్నది:

1. లైఫ్ మెంబర్స్‌గా 20 సంవత్సరాల పైగా ఉన్న వారు తిరిగి రూ.1116/- కడితే వారికి 20 సంవత్సరాలు ఈ మాస పత్రిక పంపుతాము. కాబట్టి వారిని వెంటనే ఈ మొత్తం కట్టమని ప్రార్థిస్తున్నాము.
2. యాన్యువల్ మెంబర్స్‌ని కూడా రూ.1116/-కట్టి లైఫ్ మెంబర్స్‌గా మారమని కోరుతున్నాము.
3. ఈ ఆధ్యాత్మిక మాస పత్రికాభివృద్ధి కోరే దాతలను రూ.11116/-కట్టి మహారాజపోషకులుగా, రూ.5116/- కట్టి రాజపోషకులుగా చేరమని వేడుకుంటున్నాము.
4. మీ బంధు మిత్రులను, తోటి సహాధ్యాయులను సభ్యులుగా చేర్చమని కోరుతున్నాము.

ఈ చందా రుసుము YSCKPM CHARITABLE TRUST - SAMARDHA SADGURU MAGAZINE A/C పేరుమీద MO/DD/Cheque గాని తీసి పంపించ ప్రార్థన

సమర్థ సద్గురు యాజమాన్యం

# శ్రీబాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ మద్రాసులో పాంగ్రూవ్ హోటల్‌లో భక్తులకు ఉద్బోధిస్తూ “సమర్థుడైన సద్గురువు సాధకుని యొక్క సాధనకి అంతరాయం కలిగితే చూస్తూ ఊరుకుంటాడా? దానికి తగిన పరిష్కారమార్గాన్ని గురించి ఆలోచించడా? ఆయన అసమర్థుడా? సాధకుడు తనకి అశాంతిగా ఉన్నప్పడు అశాంతి ఎక్కడనుండి వచ్చింది? అని విచారణ చెయ్యాలి. అది బయటనుండి వచ్చిందా లేక లోపలనుండా అనేది తెలుసుకోవాలి. సాధకుడు తన చెవి ద్వారా వినకూడని మాటలు వినడంవలన ఆ శబ్దం అశాంతికి కారణమౌతుంది. సాధన ఏకాంతంలో బాగుంటుందా లేక పదిమందిలో బాగుంటుందా? సాధనకి ఏకాంతం కావాలి. ప్రబోధము జన సమూహంలో జరగాలి. సద్గురుమూర్తి పాదపూజ మహోత్సవంలో రక్షపెట్టమని వేరొకరిని ఆదేశిస్తే ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ఆ సాధకుడు తానేదో తప్పచేసినందువలన అలా జరిగి ఉంటుందనే భావన ఎంతవరకు సమంజసం?



సద్గురుమూర్తి సాధకులకు దృక్ దీక్ష ద్వారా గాని, హస్తమస్తక సంయోగము ద్వారా గాని రక్షను అందజేయలేరా? సాధన పటిష్ఠంగా చేసే సాధకుని యొక్క మనస్సు విచారణ చేయగా చేయగా విషయం బోధపడి మనస్సు శాంతిస్తుంది. ప్రపంచము అంటే ద్వైతము, జగత్తులో ఉన్న సాధకుని మనస్సు అశాంతిగా ఉన్న స్థితిలో గోరుచుట్టు పైన రోకటిపోటు అన్నట్లుగా అతని స్నేహితులు ఉన్నవి లేనివి ఏవేవో కల్పించి చెప్పి సాధకునికి మనశ్శాంతి లేకుండా చేస్తారు. అందువలన సాధకుడు బాహ్య శబ్దాల సంఘర్షణలో పడకుండా తనసాధన పటిష్ఠంగా చేసుకుని గురుదేవుని అనుగ్రహాన్ని పొందవచ్చు. కానీ మనస్సులో ఈ జరిగిన

సంఘటనల రీల్స్ తిరుగుతూ ఆవేదనకి గురి అవకుండా సాధకుడు వుండగలడా? ఇటువంటి స్థితిని అధిగమించాలంటే ఒకే ఆసనంలో రెండుగంటల కాలం కదలకుండా కూర్చోగలిగితే మనస్సు తప్పక నిలబడతుంది.

మనస్సు నిలబడకపోవడానికి కారణం సాధకునిలో బలంగా పాతుకుపోయిన విపరీతభావన లేక దేహభావన లేక సంస్కార హీనత. ఈ కనబడే జగత్తు సత్యమైనది అనే భావన ఉన్నంతవరకు సాధకుని మనస్సు ఎంతసాధన చేసినా నిలబడదు. మనస్సు నిలబడాలంటే శమము, దమము ఆవశ్యకము. మనస్సు నిలబడటానికి ఇన్ని గంటలు సాధన చెయ్యాలనే నియమము లేదే. పటిష్ఠమైన సాధన ఒక్కక్షణం చేసినా మనస్సు నిలబడుతుంది.

సాధకుని మనస్సు నిలబడటానికి శమము అంటే అంతరింద్రియ నిగ్రహము. దమము అంటే బాహ్యేంద్రియ నిగ్రహము అవసరము. ఇంద్రియ నిగ్రహము అనగానే ఇంద్రియాలను బలవంతంగా నిగ్రహించ కూడదు. ఇంద్రియాలను బలవంతంగా నిగ్రహిస్తే దానిని హఠయోగం అంటారు. అలా చేయటం వలన ఆయోగం నుంచి బయటకు వచ్చిన వెంటనే ఇంద్రియాలన్నీ ఇంకా ఎక్కువ విజృంభణచేస్తాయి. అందువలన ఇంద్రియాలను ఎంతవరకు అవసరమో అంతవరకే వినియోగించాలి, ఏదైనా కోర్కె కలిగినపుడు అది ధర్మబద్ధమైన కోర్కె అయితే దానిని అనుభవించి ఆ తరువాత విచారణ చేయలి. అలా విచారణ చేయటం వలన సాధకుడు తనలో కలిగిన సంకల్పము తన సాధనకి అవరోధంగా ఉందా? లేదా? అన్న విషయాన్ని తెలుసుకోగల్గుతాడు. అంతేకాకుండా ఈ సంకల్పము నా గురుదేవునికి ఆమోదయోగ్యమా? కాదా? అనే విచారణ కూడా చెయ్యాలి.

మనస్సు నిలబడకుండా దోహదం చేస్తోందా? అని కూడా విచారణ చేస్తే మన ఇంద్రియాలను అదుపులోనికి తెచ్చుకొన వచ్చును. దీనిని వేదాంత పరిభాషలో ఇంద్రియ సంయమనము అంటారు. ఇంద్రియాలు చెడ్డవికావు కానీ ఇంద్రియచలనం చెడ్డది. సాధకుడు తనసాధన గురించి ప్రస్తావించాల్సిన అవసరంలేదు. సాధనలో తనకి అవరోధంగా ఉన్నవి మాత్రము నివేదించినట్లైతే దానికి తగిన పరిష్కారాన్ని

ఆయన తెలియజేస్తారు. సాధకుడు పొందే అనుభూతులు ప్రసాదించేది ఎవరు? గురుదేవుడే కదా! కాబట్టి ఆ విషయాన్ని ఆయనకు తెలియజేయవల్సిన అవసరం లేదు. కాంతి కిరణం సూర్యభగవానుని నుంచేకదా వచ్చేది. నీదగ్గరనుంచి కాంతి కిరణం వచ్చిందని ఆయనకు తెలియజేయ నవసరంలేదే! అన్నారు.

ఇంద్రియ నిగ్రహం సాధించగల్గాలంటే తత్వరత లేక పట్టుదల వుండాలి. దానినే వైరాగ్యం అంటారు. ఇంద్రియ నిగ్రహం సాధించ గల్గినప్పడే మనస్సు భగవంతునియందు లగ్నమవుతుంది. దానినే ఉపరతి అంటారు.

జగత్తులో ఏది ఎంతవరకు అవసరమో అంతవరకే వినియోగించుకోవాలి. నువ్వు గృహస్థాశ్రమంలో ఉన్నా సాధనకు అంతరాయం కలుగదు. నువ్వు సంసారంలో ఉండాలి కానీ, నీలోకి సంసారం రాకూడదు. సాధకుడు ఇంద్రియ నిగ్రహం సాధించినట్లు గుర్తు ఏమిటి? అలా సాధించిన వ్యక్తి మనస్సు ధ్యానంలో నిశ్చలస్థితి పొంది సదా భగవన్నామమన్నా, పరమాత్ముని సేవలన్నా తత్త్వబోధ అన్నా, విచారణ అన్నా ఆసక్తి చూపుతుంది. ఆ స్థితినే ఉపరతి అంటారు.

ఆ స్థితిని సాధించిన సాధకుని మనస్సు నిశ్చలస్థితిని పొంది సాధనలో మరొకమెట్టు పైకి వెడుతుంది. నిశ్చలస్థితిని పొందిన మనస్సును తితీక్ష అంటారు. అటువంటి సాధకుని మనస్సులో సంకల్పములు గానీ వికల్పములు గానీ ఉండవు. అహంకార మమకారాలకు తావుండదు. ద్వైత భావం ఉండదు. ఇది నాకు ప్రియమైనది, అప్రియమైనది అనేభావన గానీ, రాగద్వేషాలుగానీ, సుఖదుఃఖాలుగానీ ఉండవు.

'ఇంద్రియ నిగ్రహాన్ని మీరు సాధించగల్గారా? సాధించగలరా?' అని ప్రశ్నించి, తప్పక సాధించగల్గుతారు. సద్గురు దేవులు చేసిన బోధను శ్రద్ధగా శ్రవణం చేసి దానిని చక్కగా విచారణ చేసి అనుభవంలోనికి తెచ్చుకోవాలి. మననం ద్వారా అది నిదిధ్యాసకి తీసుకువెడుతుంది. అంతకన్న కావాల్సిందేముంది? అప్పడు మీపై గురుకృప అపారంగా వర్షిస్తుంది" అన్నారు.

(గత సంచిక తరువాయి)

# అమ్మమాట

- జపమాల ప్రసాద

## భజగోవిందమ్ మూఢమతే! -4



"మానవుడి యొక్క బాహ్యాపరంగా పరుగులు పెట్టే ఇంద్రియాలను ఆధ్యాత్మిక దృష్టివైపు మరల్చడానికి, అంతరేంద్రియాలయిన మనో, బుద్ధి, చిత్త, అహంకారాల సహకారం ఎంతైనా అవసరం. అన్ని ఇంద్రియాలకు మెయిన్ స్విచ్ మనస్సు అని చెప్పేవారు శ్రీబాబూజీ మహరాజ్. మనస్సు మన కంట్రోల్‌కి వస్తే మిగతా యింద్రియాలన్నీ అందులో లయించి పోతాయి.

మనకేదైనా బాధవస్తే 'నా మనస్సు ఏమీ బాగుండలేదు' అంటాం. శరీరంలో బాధ కలిగితే, 'ఆరోగ్యం బాగోలేదు, కానీ మనస్సు బాగానే ఉంది' అంటాము. కానీ, ఆనందంగా ఉన్నప్పుడు, 'నేను ఆనందంగా ఉన్నా'ననో, లేకపోతే 'సంతోషంగా వున్నాననో' అంటారుగానీ, 'నా మనస్సు ఆనందంగా ఉంది' అనరు.

మనకేదైనా ఒకటి చేయాలని లేకపోతే, 'ఒంట్లో బాగోలేదు' అంటాము. ఇవన్నీ మానసిక దోషాలు. వీటిని హరింప జేసేందుకేనేమో శివుడికి అభిషేకం చేసేటప్పుడు 'మలాపకర్షక స్నానం' సమర్పిస్తారు. మనస్సు యొక్క మాలిన్యం వదలాలంటే గురులక్ష్యార్థ సాధన, నిరంతర విచారణ వల్లనే సాధ్యమవుతుంది.

అందరూ విచారణ చేస్తారు. కానీ దేని గురించి విచారణచేస్తే విచారమనేది లేకుండా పోతుందో, దాన్ని గురించి విచారణ చేయరు. మానవులందరూ సాధారణంగా చేసే విషయాదుల విచారణ, విచారానికే దారి తీస్తుంది. 'అసలు నేను ఎవరు? కోహమ్? ఎక్కడి నుండి వచ్చాను? ఎక్కడకి వెడతాను? పుట్టడం - చావడం ఇదేనా జీవిత పరమావధి?'..... ఇటువంటి విచారణ చేయకపోతే ఎటువంటి పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందో శ్రీ శంకర భగవత్పాదులవారు యీ క్రింది శ్లోకంలో వివరిస్తున్నారు ..........

పునరపి జననం - పునరపి మరణం
పునరపి జననీ - జఠరే శయనం
ఇహ సంసారే - బహుదుస్తారే
కృపయా పారే - పాహి మురారే!

పుట్టటం, మరణించడం, మళ్ళీ పుట్టడం, మళ్ళీ మరణించడం - ఇట్టి బహు దుస్తారమైన సంసార సాగరం నుండి తరించాలి అంటే మురారి శరణుపొందు' అని ఆచార్యదేవులు ఆదేశిస్తున్నారు.

మనస్సు, వాక్కు, శరీరము అనే త్రికరణములు పవిత్రమైననాడు త్రికరణ శుద్ధిగా ధ్యానం చేయడానికి ప్రయత్నం చేస్తాము. 'నేను చేస్తున్నాను' అన్నదానిలో 'నేను' మిగిలిపోవాలి. మనస్సు చేసే దోషాన్ని మనస్సు చేతనే గుర్తింపజేయాలి. ఇకప్పుడు ఆ దోషం మళ్ళీ చేయకుండా వుండాలి. నువ్వు సంసారంలో వున్నా ఫరవాలేదు కానీ, నీలో సంసారం వుండకూడదు. తన్ను తాను గుర్తించడం అనేది, ఆత్మజ్ఞానం పొందడమనేది ఒక్క మానవజన్మలోనే సాధ్యం. అత్యంత దుస్తరమైన ఈ సంసార సాగరాన్ని దాటగలనా అని అధైర్యపడవద్దు.

"ఈ సంసారం ఇచ్చినవాడూ వాడే, నన్ను పుట్టించినవాడూ వాడే, నన్ను రక్షించేవాడూ వాడే" అనే అచంచల విశ్వాసం భగవంతునిపై కలిగివున్నవాడికి అన్నీ ఆ ప్రసాదదేవుడే ప్రసాదిస్తాడు!

-సశేషం


**SUBSCRIPTION NOTIFICATION FOR ENGLISH (QUARTERLY) AND TELUGU(MONTHLY) SAMARDHA SADGURU MAGAZINES**

TELUGU MAGAZINE LIFE MEMBERS ARE REQUESTED TO BECOME 'MAHARAJA POSHKULU' AND 'RAJA POSHAKULU' BY DONATING RS.11116/- AND 5116/-RESPECTIVELY.

WE ALSO APPEAL LIFE AND ANNUAL SUBSCRIBERS TO BECOME LIFE MEMBERS BY REMITTING RS.1116/- THIS WILL BE OF GREAT HELP TO MEET THE INCREASE IN COSTS OF VARIOUS INPUTS.

WE ALSO REQUEST THE DEVOTEES TO SUBSCRIBE FOR SAMARDHA SADGURU QUARTERLY ENGLISH MAGAZINE. SUBSCRIPTION FOR ENGLISH MAGAZINE IS RS 100/- FOR FIVE YEARS.

REMITTANCES SHOULD BE MADE IN THE NAME OF Y.S.C.K.P.M CHARITABLE TRUST-A/C SAMARDHA SADGURU MAGAZINE BY M.O/ DRAFT/MAIL TRANFER

SAMARDHA SADGURU MANAGEMENT

# తపస్సు - ప్రార్థన

- పాలూరి కాళీప్రసాద్

సాధారణంగా మనం తపస్సు అంటే ఏ అడవికో వెళ్ళి, నిద్రాహారాలు మాని, శరీరాన్ని కృశింపజేయాలని అనుకుంటాం. కానీ భగవద్గీతలో 17వ అధ్యాయంలో మనోవాక్కాయములతో చేయగల మూడు విధాలైన తపస్సును గీతాచార్యుడు మనకు ప్రబోధించాడు. అవేమిటో చూద్దాం ...

**శరీరంతో చేసే తపస్సు -**

**దేవ ద్విజ గురు ప్రాజ్ఞ పూజనం శౌచమార్జవం ।**
**బ్రహ్మచర్య మహింసా చ శారరం తప ఉచ్యతే ॥ 17/14**

దేవతలను, ద్విజులను, గురువులను, జ్ఞానులను పూజించటం, శుచిగా, నిజాయితీగా ఉండటం, బ్రహ్మచర్యాన్ని, అహింసను పాటించటం శరీరంతో చేసే తపస్సు అవుతుంది.

**వాక్కుతో చేసే తపస్సు -**

**అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియ హితం చ యత్ ।**
**స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే ॥ 17/15**

ఎవరికీ ఉద్వేగం కలిగించని, రెచ్చగొట్టని వాక్కు, అలాగే సత్యంగాను, అవతలివారికి ప్రియాన్ని, హితాన్ని కలిగించేదిగా ఉండేవాక్కు, ఇంకా వేదాధ్యయనం చెయ్యటం ఇవి వాక్కుతో చేసే తపస్సు అవుతుంది.

**మనస్సుతో చేసే తపస్సు -**

**మనః ప్రసాద సౌమ్యత్వం మౌనమాత్మ వినిగ్రహః ।**
**భావ సంశుద్ధిరిత్యేతత్తపో మానసముచ్యతే ॥ 17/16**

మనస్సును ప్రసన్నంగా ఉంచుకోవటం, ఎప్పుడూ సౌమ్య స్వభావం కలిగి ఉండటం, మనస్సులో ఎల్లప్పుడూ పరిశుద్ధమైన భావనలే ఉత్పన్నమవ్వటం ఇవి మనస్సుతో చేసే తపస్సు అవుతుంది.

ఇదే విధంగా శ్రీగురుదేవులు మనకు ఈ తపస్సులను ఆశ్రమ నిత్య ప్రార్థన రూపంలో తేటతెలుగు పదాలలో అందించారు.

**వాక్కుతో చేసే తపస్సు -**

సత్యసుందర స్వరూపుడవైన ఓ పరమేశ్వరా! సత్యముగను, పవిత్రముగను, మృదువుగను ఉండు వాక్కును, నిర్మలమగు అంతఃకరణ మును మాకు ప్రసాదింపుము.

**శరీరంతో చేసే తపస్సు -**

అవ్యాజ కరుణామూర్తీ! తనుమన ధనములతో సదా యితరులకు మంచినే చేయుటకును, యితరులయందు మంచినే చూచుటకును, మంచినే గ్రహించుటకును తగిన సద్బుద్ధిని మాకు దయసేయుము.

**మనస్సుతో చేసే తపస్సు -**

దీనబంధూ! దయానిధే! మా మనస్సు అచంచల విశ్వాసంతో నిరంతరం నీ యందే నిలచియుండునట్లు అనుగ్రహింపుము. మాలో భక్తి జ్ఞాన వైరాగ్య బీజములు అంకురించి, పెంపొంది, ఆత్మానంద ఫలము నొసగులాగున ఆశీర్వదింపుము.

**బుద్ధితో చేసే తపస్సు -**

ఓ పరంజ్యోతి స్వరూపా! మార్గదర్శకుడవై చీకటి నుండి వెలుగు లోనికిని, అసత్యము నుండి సత్యవస్తువు కడకును, మృత్యువు నుండి అమృతత్వమునకు మమ్ము నడపింపుము.

**ఇలా లోకంలో ప్రతిఒక్కరూ ఆచరిస్తే ప్రపంచానికి కలిగే ఫలితం-**

దేవదేవా! నీ కృపచే మానవునికి, మానవునికి మధ్య భేదబుద్ధి నశించి, సర్వజీవులు సమభావముతోను, ప్రేమదృష్టితోను మెలగుదురుగాక! లోకములన్నియూ శాంతి సౌఖ్యములతో వర్ధిల్లును గాక!

(ఆధ్యాత్మికతను మించిన సోషలిజం వేరే లేదనేవారు శ్రీగురుదేవులు)

**ఇక వ్యక్తిగతంగా మనకు కలిగే ఫలితం -**

ప్రభూ! అనుక్షణమును అంత్యకాలముననను నీ స్మరణయే మా జిహ్వ యందు నిలచుగాక! నీ రూపమే మా మనస్సునందు నిలచియుండు గాక! ఈ జన్మమే మా కడసారి జన్మమై నీ సాయుజ్యమును పొందించు గాక! పాహిమాం! పాహిమాం! పాహిమాం! పాహి!! హరిఃఓమ్ తత్సత్!

# అంజలి

- కరుణ శ్రీ

సీ ॥ ఆకు కోసిన వృక్ష మాకుల పడునేమొ !
ఇదె తను పత్ర మర్పింతు స్వామి
పూలను ద్రుంచిన పూలతేమలుగునో
ఇదె మనః పుష్ప మర్పింతు స్వామి
ఫలము ద్రుంచిన రామచిలుకయేమలుగునో
ఇదె కర్మ ఫల మర్పింతు స్వామి
తోయంబు గొన నదీ కాయంబులలుగునో
ఇదె బాష్ప తోయ మర్పింతు స్వామి

తే.గీ ॥ పత్రమో పుష్పమో మరి ఫలమొ జలమొ
లోటు రానీయనున్నంతలోన స్వామి
ఒకరి వస్తువులనడిగి తేబోను గాని
నాది యన్నది సర్వము నీదె స్వామి !



# ముగ్గురు చింతనాపరులు

- రమణ ప్రసాద్

ప్రార్థన చేసేటప్పుడు గంభీరమైన మాటలను వాడేవారు అవన్నీ వింటాడని అనుకొంటారు. నువ్వు అలా చేయకు. నీ తండ్రికి నువ్వు అడగకముందే నీకు ఏమి కావాలో తెలుసు, -మేథ్యూ

ఒక బిషప్(మత ప్రవక్త),కొంత మంది యాత్రికులతో ఒక ఓడలో "ఆర్చాంజల్" నుండి "సోలోవెట్స్కీ మొనాస్టీ"కి వెళ్తున్నాడు. ఓడ నెమ్మదిగా వెళ్తోంది. గాలివాటం అనుకూలంగా ఉంది. ఒక ఫిషర్‌మేన్ (చేపలు పట్టేవాడు) ఏదో చెబుతుంటే కొంతమంది ఆసక్తిగా వింటుండటం చూసి, బిషప్ వారి వద్దకు వెళ్లాడు. ఆ ఫిషర్‌మేన్. తదితరులు గౌరవసూచకంగా తమ తలలపై నుండి కేప్స్(టోపీలు) తీసి నుంచున్నారు. "అతడు ఏమి చెబుతున్నాడో విందామని వచ్చాను" అన్నాడు బిషప్. "అతను ఆ కనిపించే దీవిలో ఉండే (హెర్మిట్స్)-చింతనాపరుల గురించి చెబుతున్నాడు" అన్నారు అక్కడ ఉన్నవారు. "అయితే ఆ హెర్మిట్స్ గురించి వినాలని కుతూహలంగా ఉంది." అన్నాడాయన.

"ఏదీ !ఎక్కడ ఉంది ఆ దీవి?" అని అడిగాడు."అక్కడ దూరంగా" అన్నాడు ఫిషర్‌మేన్. "వాళ్ళు ఎంతో పవిత్రులు. నేను వారి గురించి వినడమే కాని ఒక సంవత్సర క్రితం వరకు చూడలేదు. నేను చేపలు పడుతూ ఒక నాటి రాత్రి ఆ ద్వీపంలో ఉండిపోవాల్సి వచ్చింది. తెల్లవారాక అక్కడ ఒక కుటీరం, అందులో ముగ్గురు వ్యక్తులు కనిపించారు." అన్నాడు ఫిషర్‌మేన్.

'వాళ్ళు ఎలా ఉన్నారు?' అని అడిగాడు బిషప్ ఉత్సుకతతో. ఒకతను పొట్టిగా వొంగొని ఉన్నాడు. అతనికి వంద సంవత్సరాలు వుంటాయేమో. ఎప్పుడూ అతని మొఖంపైన చిరునవ్వు చిందులాడుతూ ఉంటుంది. రెండవ వాడు పొడగరి. బలిష్టుడు. రైతులు వేసుకొనే కోటు ధరించి ఉన్నాడు. అతను కూడా ముదుసలే. మూడవవాడు తెల్లటి గడ్డం. కళ్ళు తీక్షణంగా ఉంటాయి. నడుం చుట్టూ చాప కట్టుకొని వున్నాడు.

"వారు నీతో మాట్లాడారా?" అన్నాడు బిషప్. "లేదు. వారు నిశ్శబ్దంగా పనులు చేసుకుంటూ పోతున్నారు. ఒకడు కళ్ళతో సైగ చేయగానే మిగిలిన ఇద్దరూ దానిని అర్థం చేసుకొని ఆ పని పూర్తి చేస్తున్నారు. నేను ఆ పొడగరితో " ఇదేమి ద్వీపం?" అని అడిగాను.

అతడు నాపై కోపంగా చూశాడు. కాని ఆ పెద్దాయన తనని ఆపి,"మా మీద దయ ఉంచండి" అన్నాడు.

ఇంతలో ఓడ ద్వీపం దగ్గరకు వచ్చింది. " నేను వారిని చూడాలి. వారు మోక్షగాములా?" అని అడిగాడు. "అక్కడికి ఓడ వెళ్లదు. కొంతదూరం బోట్‌లో వెళ్ళాల్సి ఉంటుంది" అన్నాడు ఆ ఓడ కెప్టెన్. బోట్ మీద బిషప్ ఆ ద్వీపానికి చేరుకొన్నాడు. ఆ హెర్మిట్స్ ముగ్గురూ చిరునవ్వుతో బిషప్‌కు స్వాగతం పలికారు.

"మీరు పవిత్రాత్మలని తెలిసి వచ్చాను. మీరు క్రీస్తును ఏ విధంగా ప్రార్థిస్తున్నారు? నన్ను ఆ క్రైస్తే మీవద్దకు పంపాడు. మీకు ప్రార్థన ఎలాచేయాలో నేర్పుతాను." అన్నాడు బిషప్. ఆ ముగ్గురూ నవ్వి వూరుకున్నారు. " ఇప్పుడు చెప్పండి. భగవంతుని రక్షణకోసం మీరు ఎలా ప్రార్థన చేస్తుంటారు?" అని అడిగాడు బిషప్. వారిలో పెద్ద అయినవాడు, "మాకు భగవంతుణ్ణి ఎలా సేవించుకోవాలో తెలియదు." అన్నాడు. "మరి ఎలా ప్రార్థిస్తారు?" అని అడిగాడు బిషప్.

మేము ప్రార్థన ఇలా చేస్తాము - "మీరు ముగ్గురు. మేము ముగ్గురం. మాపై దయ ఉంచు." ఆయన అలా అనగానే ఆ ముగ్గురూ హెవెన్(స్వర్గం)వైపు చూస్తూ," మీరు ముగ్గురు, మేము ముగ్గురం. మా పై దయ ఉంచు" అని ప్రార్థించారు.

బిషప్ నవ్వి, " మీరు హోలీ ట్రినిటీ (ముగ్గురు మహాత్ములు) గురించి విని ఉన్నారు. కాని మీరు సరిగ్గా ప్రార్థించటం లేదు. మీరు నా ప్రేమను చూరగొన్నారు. భగవంతుని ప్రార్థన ద్వారా భగవంతుని ఎలా మెప్పించాలో మీకు నేర్పుతాను. భగవంతుడు మానవాళిని రక్షించటానికి ఎలా ప్రకటితమయ్యాడో, ఏ విధంగా తనను ప్రార్థించాలని చెప్పాడో మీకు చెబుతాను. మీరు నాతో పాటు అనండి." అని, "అవర్ ఫాదర్!(మన తండ్రి) " అన్నాడు. ఆ ముగ్గురూ "అవర్ ఫాదర్" అన్నారు. "విచ్ ఆర్ ఇన్ హెవెన్"(స్వర్గంలో ఉన్న మన తండ్రి) అన్నాడు బిషప్.

మొదటి ఆయన సరిగ్గా చెప్పాడు. రెండవతను సరిగ్గా పలకలేకపోయాడు. ముదుసలి హెర్మిట్‌కు పళ్ళు లేనందున బోసినోటితో అస్పష్టంగా చెప్పాడు. బిషప్ తిరిగి ప్రార్థన చెప్పి వాళ్ళచేత చేయించాడు. చీకటి పడటంతో బిషప్ వారివద్ద నుంచి శలవు తీసుకున్నాడు.

ఓడ మెల్లగా నడుస్తోంది. బిషప్ సముద్రం వైపు చూస్తుండగా ఒక వెలుగు గోచరించింది. అది ఇంకొక ఓడ మనని దాటి వెళ్తోంది

అనుకొన్నాడు. కాని ఆశ్చర్యం! ఆ ముగ్గురు హెర్మిట్లు సముద్రం పై తేలి తన వద్దకే వస్తున్నారు. వారు నేలమీద నడచినట్లుగా నీటిమీద నడిచి వస్తున్నారు. ఓడ వద్దకు వచ్చి ఆ ముగ్గురూ ఒకే కంఠంతో ఇలా అన్నారు -"ఓ భగవంతుని సేవకుడా! నువ్వు చెప్పిన ప్రార్థన మరిచిపోయాము." బిషప్ వారున్నవైపుకు వచ్చి," మీరు ఎప్పుడూ చేసే ప్రార్థన భగవంతుని వద్దకు చేరుస్తుంది. నేను మీకు బోధించ తగ్గవాడను కాను. పాపులగు మమ్ము క్షమించమని భగవంతుని వేడండి" అని వారికి నమస్కరించాడు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

ఆగస్ట్ 2017

04 శుక్ర - వరలక్ష్మీ వ్రతం.

07 సోమ- రాఖీ పౌర్ణమి, సాయంత్రం 5-30ని॥ శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్త సమారాధన.

15 మంగళ - శ్రీ కృష్ణ జన్మాష్టమి - సాయంత్రం 5-30ని॥ శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

17 గురు - శ్రీ గురు దశమి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

25 శుక్ర - వినాయక చవితి - ఉదయం 11గం॥లకు శ్రీ సద్గురు పాదపూజ. భక్త సమారాధన.

సెప్టెంబర్ 2017 - 4సోమ -10ఆది - శ్రీమాతాజీవారి సత్సంగ సమావేశాలు.

06 బుధవారం - భాద్రపద పౌర్ణమి - సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

15 శుక్రవారం - శ్రీ గురు దశమి, సాయంత్రం 5గం॥ల 30 నిలకు సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

27 బుధవారం - మూలా నక్షత్రం, సరస్వతీ పూజ, సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

28 గురువారం- దుర్గాష్టమి - సాయంత్రం 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

29 శుక్రవారం - మహర్నవమి. సాయంత్రం 5-30గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

30 శనివారం విజయ దశమి - ఉదయం 11గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

# త్రిపురా రహస్యం

(గత సంచిక తరువాయి)

- రమణ ప్రసాద్

## జ్ఞాన ఖండం

హేమచూడుడు ఆత్మ స్వరూపాన్ని ఉపదేశించమని అడుగగా హేమలేఖ ఇలా చెబుతున్నది-

" ఆత్మ కనబడేది కాదు. వాక్కులకు అందదు. దాని గురించి ఏ విధంగా చెప్పగలను? నీ ఆత్మ స్వరూపాన్ని నువ్వు ముందుగా తెలుసుకుంటే , తరువాత త్రిపురా దేవి రహస్యాన్ని తెలుసుకోగలవు. శుద్ధ బుద్ధికి సమాశ్రయమైన నీ స్వరూపాన్ని నీ ఆత్మగా తెలుసుకో. నీ బుద్ధికి కూడా ఆశ్రయమైన ఆత్మ తత్వాన్ని తెలుసుకో. దృశ్య ప్రపంచాన్ని నిషేధించగా కేవలం సాక్షి రూపంగా వుండేదే ఆత్మ. ఇది దేవతలనుండి క్రిమికీటకాదులవరకు అన్నిటిని ప్రకాశింప చేస్తుంది. దానిని ప్రకాశింప చేసేది వేరొకటి లేదు. ఆత్మస్వరూపాన్ని తెలియచేయమని అడగటం -



'నా కళ్లను నాకు చూపించమన్నట్లుగా వుంటుంది.' ఎంతటి నిపుణుడైన గురువైనా నీ కళ్లను నీకు చూపగలడా? గురువు ఆత్మ దర్శనానికి సాధనాన్ని, ఉపాయాన్ని మాత్రమే చెప్పగలడు. శిష్యుడు తన మనస్సు అంతర్ముఖమైనప్పుడు ఆత్మకు సమీపంగా వస్తాడు.

"నాది" అని భాసించేదంతా "నీవు"కాదు(ఆత్మ కాదు). "నాది" కంటే ఏది భిన్నంగా భాసిస్తుందో, అదే నీ నిజ రూపం. ఏకాంతంలో కూర్చుని వివేకంతో పరిశీలించు. నాది, నాది అని మమత్వంతో భాసించే వాటిని వదిలెయ్యి. అలా వదిలి వెయ్యగా మిగిలినది "ఆత్మ"గా గుర్తించు. నన్ను నీవు నీ భార్యగా భావిస్తున్నావు అంటే, ఈమె నాది, నా భార్య అని భావిస్తున్నావు. కాని నేను నీ స్వరూపాన్ని కాను కదా! ఇలా నాది అనే వాటినన్నీ వదిలి వేయగా, దేనిని వదలుటకు సాధ్యం కాదో దానిని ఆత్మగా తెలుసుకో."

ఈ మాటలను విని హేమచూడుడు వెంటనే గుఱ్ఱము నెక్కి నగరం వెలుపలికి వచ్చి ఉద్యానవనం లోనికి వెళ్ళి, అందులో స్ఫటిక

నిర్మితమైన మేడలో తొమ్మిదవ అంతస్తు లోనికి వెళ్ళాడు. “నేను ఏకాంతాన్ని కోరుతున్నాను నా ఆజ్ఞ లేకుండా ఎవరినీ రానీయవద్దు” అని చెప్పి ధ్యానంలో కూర్చుని మనస్సు ఏకాగ్రం చేశాడు. విచారణ చేయటం మొదలు పెట్టాడు-“ ఈ ఇల్లు ధనధాన్యాలు ఇవి “నేను” అనే (అహంకు) ఆశ్రయాలు కావు. కాబట్టి అవి నా స్వరూపములు కావు. “నేను”ను దేహంగా భావిస్తున్నాను. నెత్తురు, ఎముకల సమూహమైన దేహం “నేను”(ఆత్మ) కాదు. స్వప్నంలో నా శరీరం నాకంటె భిన్నంగా కనిపిస్తోంది. సుషుప్తిలో భాసించటమే లేదు. ఇటువంటి దేహం “నేను” ఎలా అవుతుంది?

ప్రాణము, మనస్సు, బుద్ధి కూడా నా కంటె భిన్నములే.“నేను” ఎప్పుడూ ప్రకాశిస్తోంది. ఈ “నేను”ను ఏది ప్రకాశింప చేస్తోందో తెలియటం లేదు. కుండ మొదలైన వాటిని కన్ను ప్రకాశింప చేస్తోంది. మరి బుద్ధిని ఏది ప్రకాశింప చేస్తోంది? అని తిరిగి విచారణ చేయసాగాడు. ముందు చీకటిని చూసి “అదే నా రూపం” అనుకొన్నాడు. ఇంకొకసారి చూడాలని చిత్తాన్ని నిరోధించి చూశాడు. ఆది అంతము లేని ప్రకాశం గోచరించింది. మళ్ళీ ప్రకాశాన్ని చూడాలని అనుకొని ప్రయత్నిస్తే మనస్సు నిద్రలోకి జారుకుంది. స్వప్నం వచ్చింది. స్వప్నంలో ఎన్నో కనిపించాయి. ఇది మనో విలాసమే కదా అని చిత్తాన్ని నిరోధించాడు. అప్పుడు ఆనంద సముద్రంలో మునిగాడు. తిరిగి మనస్సు చలించింది. మెలకువ వచ్చింది. నేను చూచినదేమిటి?చిత్త విభ్రమమా? లేక సత్యమా? ఏ విషయమును అనుభవింపకున్నా నాకు ఆనందం ఎలా కలిగింది? నేను గాఢ నిద్రలో ఉన్న వానివలె మూఢుడనైనాను. జ్ఞానం భాసించటం లేదు. ఆత్మను తెలుసుకోవాలని ప్రయత్నించాను. నాకు ఏమీ తెలియటం లేదు. ఆత్మ, ప్రకాశమా? అంధకారమా? సుఖమా? ద్వారపాలకునిచేత హేమలేఖను పిలిపించి, ఆమెతో,“ ఆత్మ ప్రాప్తమైనది కదా! ఆత్మ ఎల్లప్పుడూ భాసించుచుండవలెను కదా! మరి ఆత్మ కంటె ఇతరములు భాసించుచున్నవేమి? దీని గురించి వివరించమ”ని అడిగాడు.

-సశేషం

# భగవంతుని సన్నిధికి

- గాలి జగదీశ్

రాముని రాజ్యాభిషేకమైన కొద్ది రోజుల తరువాత కౌసల్య రామునితో "రామా! మేము వనవాసం వెళ్ళడానికి తగిన ఏర్పాట్లు చేయ" మనగా, రాముడు దానికి సమాధానంగా "అమ్మా! నేను పధ్నాలుగేళ్ళు వనవాసం చేసి, మీ సాన్నిధ్యాన్ని పొందలేక పోయాను. రాచ కార్యాలతో అలసిపోయినప్పుడు నీ ఒడిలో తలపెట్టుకుని సేద తీర్చుకుంటాను. ఏదైనా మార్గదర్శకత్వం కావలసినప్పుడు నీ ఒడిలోనే నేను స్వాంతన పొందుతాను. మీరు ఎక్కడికీ వెళ్ళవద్దు" అని విన్నవించుకుంటాడు.

కౌసల్య సహజ వాత్సల్య భావనతో "రామా! ఇదంతా జీవుని మోహం మాత్రమే. జీవుడు బాలునిగా ఉన్నప్పుడు తల్లిదండ్రుల అవసరం వున్నదనుకుంటాడు, పెద్దయినప్పుడు కుటుంబీకులకు నా అవసరమూ, నాకు వారి అవసరమూ ఉన్నదనుకుంటాడు. వృద్ధాప్యంలో పిల్లలకు, మనవలకు, సంబంధీకులకు నా అవసరం ఉన్నదనుకుంటాడు. కానీ, రామా! నిజానికి జీవుడు తనను తాను ఉద్ధరించుకోవలసి ఉన్నది.

నీవు నా పుత్రుడవు రాముడవి, మహారాజైన రాముడవి, చివరకు భగవంతుడవైన రాముడవు కూడాను. నీవు స్వయంగా త్రికాలవేదివి. మోహాన్ని తొలగించుకోమని అందరికీ చెప్పవలసిన నీవే మోహవశుడవై పలుకుతున్నావేమిటి?" అన్నది.

రాముడు "తల్లీ! నీవు ధన్యురాలవు! భక్తి ధర్మాలయందు నీవు అగ్రగణ్యురాలవు. కానీ, ఇప్పుడు ఆత్మవివేకము, వైరాగ్యములలో కూడా నీవు గొప్పదానవని నాకు తెలిసింది" అన్నాడు. అప్పుడు శ్రీరాముడు కౌసల్యా, సుమిత్ర, కైకేయిల ముగ్గురకూ శృంగుని ఆశ్రమంలో వసతికి ఏర్పాట్లు చేయించాడు.

మహారాజైన శ్రీరాముడే స్వయంగా తన కొడుకు, అయోధ్యా రాజ్యంలో రాజమాత పదవిలో వుండి, సాధనకు కావాలనుకుంటే ఎన్నో గదులున్నప్పటికీ, కౌసల్య మోహంలో చిక్కకుండా, భగవంతుని సాధనకై సర్వసంగ పరిత్యాగం చేసి, ఏకాంతంలోకి వెళ్ళిపోయింది. ఎవరిలో అయితే అన్ని రకాల ప్రవృత్తులూ అంతమైపోతాయో, ఆ చైతన్యరాముని యందు విశ్రాంతి పొందేందుకు వెళ్ళవలసి ఉంటుంది.

అందుకే భక్తులందరూ గమనించవలసినదేమంటే, వీలైనంత త్వరలో మనం మన బాధ్యతలను ముగించుకొని, జీవితంలోని చివరి దశలో, భగవత్ప్రాప్తికై ఆశ్రమంలో స్థిరపడి, శాంతి మరియు విశ్రాంతిని పొందే ప్రయత్నం చేయగలరని ప్రార్థన!!

# గీతా పండితుని ఆస్తిక్య బుద్ధి

(వార్తాలాపము నుండి)　　　　సేకరణ - మురళీ

శ్రీకృష్ణ పరమాత్ముని పరమభక్తుడు ఒకడుండేవాడు. నిత్యమూ భగవద్గీతా పారాయణ చేయటం వలన అతనిని అందరూ 'గీతా పండితుడు' అని పిలిచేవారు. అయాచితంగా లభించిన దానితోనే కుటుంబపోషణ చేసేవాడు. ఒకసారి బాగా కరువుకాటకాలు రావటంతో జీవిత నిర్వహణ బాగా కష్టమైపోయింది. భార్య కుటుంబ పోషణకోసం పురుషార్థం చేయమని చెబుతూ ఉండేది. "ఇంతవరకు నేను ఎవరినీ యాచించలేదు. ఇక ముందు కూడా యాచించటానికి వెళ్లను" అని ఖచ్చితంగా చెప్పేశాడు.

"పిల్లలూ, మనం కూడా ఆకలితో చచ్చిపోవటానికి సిద్ధంగా వున్నాం. గ్రామంలోకి వెళ్లి ఏదో ఒక యాయవారము తీసుకురండి" అని భార్య చెప్పింది. దానికి అతడు అంగీకరింపక "భగవంతుని యందు శ్రద్ధా భక్తులు కలిగి వుండు" అని సమాధానం చెప్పాడు.

"నా యందు అనన్య భక్తితో నన్ను చింతన చేయుచూ, నన్ను ఉపాసించుచూ, నా యందు నిత్యమూ ప్రేమ చూపిస్తూ ఉండే భక్తుల యోగ క్షేమాలను నేనే చూస్తాను" - అని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో చెప్పాడు. కాబట్టి ఆయన యందు శ్రద్ధ కలిగి వుండమని భార్యతో చెప్పాడు.

ఆమె గీతలో వ్రాసినదంతా అబద్ధమని, భగవద్గీతలో ఉన్న ఆ శ్లోకాన్ని మూడుసార్లు గంటంతో కొట్టివేసింది. అది చూసి ఆ బ్రాహ్మణుడు "నా ప్రభువు యందు నీకు నమ్మకంలేదా?" అని మిక్కిలి దుఃఖపడి, ఇంటిలో నుంచి బయటకు వెళ్లి, ఏకాంత స్థానంలో కూర్చుని గీతా పఠనం చేయసాగాడు.

ఇంతలో ఒక గొల్ల యువకుడు కావడిలో పప్పు, పిండి, నెయ్యి, పెరుగు, పంచదార, బియ్యము, కూరలు మొదలగు పదార్థములను తీసుకు వచ్చి, పండితుని భార్యకు అందజేశాడు. ఆమె "ఇవన్నీ ఎవరు పంపారు?" అని ప్రశ్నించగా, "మా యజమాని శేఠ్‌గారు మీకు స్వయం పాకం పంపారు" అని సమాధానం చెప్పాడు.

ఆమె వంటకం తయారు చేసి, ఆ యువకుడిని భోజనం చేసి వెళ్ళమన్నది. అతడు "నాకు భోజనం చేసే సామర్థ్యం లేదు. నా నాలుక మీద మూడు పుండ్లు పడ్డాయి. వాటి నుండి రక్తం కారుతోంది" అని చెప్పాడు. "నా భర్త వచ్చి అడిగితే ఏమని చెప్పాలి నేను?" అని అడిగింది. దానికి "నాలుక మీద మూడు పుండ్లు వున్న మనుష్యుడు వచ్చి యీ సరుకులు యిచ్చాడని చెప్పండి" అని వెళ్ళిపోయాడా యువకుడు.

పండితుడు సాయంత్రం వరకు గీతా పఠనం చేసుకుని తిరిగి యింటికి వచ్చాడు. భార్యవలన జరిగిన విషయమంతా తెలుసుకుని, "ఆ వచ్చినది ఎవరో కాదు సాక్షాత్తు శ్రీకృష్ణ పరమాత్ముడే! అవి నాలుక మీద పుండ్లు కావు, గంటముతో కొట్టిన కొట్టి వేతలు. ఇప్పుడైన తెలుసుకుని పరమాత్మునిపై అచంచల భక్తి శ్రద్ధలను కలిగి ఉండు. భవిష్యత్తు గురించి చింతించకుండా ఉంటే భగవంతుడే స్వయంగా వచ్చి భక్తులను రక్షిస్తాడు" అని పండితుడు తన భార్యకు ఉపదేశించాడు.

## *సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి*

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఆగస్ట్ 2017, సెప్టెంబరు 2017, మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి

ఆగస్ట్ 2017: AS 5457, 7139, 7142, 7146, 7332 నుండి 7337 వరకు,
AS 7339 నుండి 7343 వరకు, 7348, 7349, 7354, 7355

సెప్టెంబరు 2017: AS 4306, 6717, 7157, 7161, 7167, 7170, 7331, 7357
AS 7358, 7359, 7360, 7364, 7365, 5708, 7366.

– మేనేజర్

# ముండకోపనిషత్తు

(గత సంచిక తరువాయి)

- రమణ ప్రసాద్

ద్వితీయ ముండకము - ప్రథమఖండం

తదేతత్ సత్యమ్ యథా సుదీప్తాత్ పావకాద్
విస్ఫులింగాః సహస్రశః ప్రభవంతే సరూపా :।
తథా క్షరాత్ వివిధాః సౌమ్య భావాః
ప్రజాయన్తే తత్ర చైవాపి యన్తి ॥

"సత్యం ఇదే! జ్వాలలనుండి వేలకొలది నిప్పు రవ్వలు ఎగసినట్లు, అక్షరమైన బ్రహ్మ నుండి నానా విధాలైన జీవులు ఉద్భవించి తిరిగి బ్రహ్మం లోనే లీనమవుతాయి."

ఆ తత్త్వం స్వయం ప్రకాశం, సర్వవాపకం, లోపల వెలుపల వున్నది. ఆ తత్త్వం అవ్యక్తం. ఈ తత్త్వం నుండే ప్రాణం, మనస్సు, ఇంద్రియాలు, పంచ భూతాలు పుట్టాయి. ఈ తత్త్వానికి శిరస్సు దేవలోకం; కళ్ళు సూర్య చంద్రులు; చెవులు దిక్కులు. వేదాలు తెరచి ఉన్న నోళ్ళు; ఊపిరి గాలి. ఈ తత్త్వమే సర్వ భూతాలలో ఉన్న ఆత్మ. దేవలోకంలో ఉన్న చంద్రుడి నుండి మేఘాలు; మేఘాలనుండి వర్షం; వర్షం వలన ఓషధులు పుట్టాయి. జీవులు పుట్టారు.

ఈ తత్త్వం నుండి దేవతలు,సాధ్యులు, మానవులు, జంతువులు, పక్షులు, ఉచ్ఛ్వాస నిశ్వాసాలు, తపస్సు, శ్రద్ధ, సత్యం , బ్రహ్మచర్యం, విధి నిషేధాలు ఉద్భవించాయి. ఇంకా 7 ఇంద్రియాలు, వాటి గ్రహణ శక్తులు ప్రభవించాయి. సముద్రాలు, నదులు, పర్వతాలు దీని నుండే ఉద్భవించాయి.

పురుష ఏ వేదం విశ్వం కర్మ
తపో బ్రహ్మ పరామృతమ్ ।
ఏతద్యో వేద నిహితం గుహాయాం
సో విద్యాగ్రన్థిం వికిరతీహ సౌమ్య ॥

"ఓ సౌమ్యుడా! ఈ తత్త్వం సమస్తంలో ఉన్నది. హృద్గుహలో ఉన్న బ్రహ్మం ఈ తత్త్వమే అని తెలుసుకొన్నవాడు అజ్ఞానం తొలగి ఈ జన్మలోనే ముక్తుడౌతాడు."

## ద్వితీయ ఖండం

ఆ తత్త్వం అత్యంత సమీపంగా హృద్గుహలో నెలకొని ఉంది. అదే ఆత్మ. కదిలేవి, శ్వాసించేవి, రెప్పలార్చేవి అన్నీ ఆ బ్రహ్మంలో ప్రతిష్ఠితమై వున్నవి. స్థూల సూక్ష్మాలకు కారణమైనది, సర్వోత్కృష్ఠమైనది అయిన ఆ బ్రహ్మను తెలుసుకోవాలి. అది తేజోవంతము, అణువు కంటె సూక్ష్మం అయి ఆ అక్షర పరబ్రహ్మం సకల లోకాలకు మూలాధారమైనది, అమరమైనది. దానిని తెలుసుకోవటానికి ఉపనిషత్తులు అందించే ప్రణవం అనే ధనుస్సును ఆత్మ అనే బాణం ఎక్కుపెట్టి మనస్సనే వింటినారిని లాగి లక్ష్యాన్ని ఛేదించాలి. ఆ లక్ష్యమే భగవంతుడు.

భూమ్యాకాశాలు, మనఃప్రాణాలు పడుగు పేకగా అల్లుకుని వున్నదే ఆత్మ అని తెలుసుకో. రథ చక్రంలోని ఆకులన్నీ ఇరుసును చేరినట్లు శరీరంలోని నాడులన్నీ చేరే హృదయకోశంలో సంచరించేదే ఆత్మ. ఆ ఆత్మనే “ఓం” అని ధ్యానించండి.

ఆత్మకు అన్నీ అవగతమే. హృదయాకాశంలోని జ్యోతిర్మయమైన బ్రహ్మపురి దాని నివాసం. మనస్సు దానికి వస్త్రం. ప్రాణ శరీరాలకు అధినేత. పరిపూర్ణమైన విజ్ఞానంతో ప్రాజ్ఞులు దానిని తెలుసుకుంటారు.

భిద్యతే హృదయ గ్రంథిః ఛిద్యంతే సర్వ సంశయాః ।
క్షీయంతే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరాపరే ॥

ఆత్మ సాక్షాతాకరం కాగానే సర్వ సంశయాలు విడిపోతాయి. అజ్ఞానపు ముడి విడిపోతుంది. అన్ని కర్మలు క్షీణించిపోతాయి.

న తత్ర సూర్యోభాతి న చంద్ర తారకం
నేమా విద్యుతో భాతి కుతో యమగ్నిః ।
తమేవ భాన్తమనుభాతి సర్వం
తస్య భాసా సర్వమిదం విభాతి ॥

“అక్కడ సూర్యుడు ప్రకాశించడు. చంద్ర తారకలు ప్రకాశించవు. ఇక అగ్ని మాట చెప్పటం ఎందుకు? ఆత్మ తేజస్సు వల్లనే యావద్విశ్వమూ ప్రకాశిస్తోంది. ఆ బ్రహ్మ ఆ ప్రక్క, ఈ ప్రక్క, ముందు వెనుక, పైన క్రింద విరాజమానమై ఉన్నది.

- సశేషం

# బహుళాపురం

- పరాశర ప్రసాద్

బహుళాపురం పండరీపురానికి సమానంగా ప్రసిద్ధి చెందినదే. పండరీక్షేత్రానికి ఆషాఢ, కార్తీక మాసాలలో పండరీనాథుని దర్శనానికి వచ్చిన భక్తులంతా తప్పక బహుళాపురానికి వెళ్ళి కూర్మదాస వరదుడైన శ్రీ పండరీనాథుని దర్శిస్తారు. మరి ఆ విశేషాలేమిటో తెలుసుకుందామా?

సూర్య రథ సారథియైన అనూరుని అంశతో జన్మించిన కూర్మదాసు కాళ్ళులేనివాడు. తాబేలు లాగా ప్రాకుతూ వెళ్ళి భగవంతుని కీర్తనలు శ్రవణం చేసేవాడు. అందువల్ల అతనిని కూర్మదాసు అని పిలిచేవారు. ఒకరోజు హరికథాగానంలో పండరీనాథుని మహాత్మ్యం గురించి శ్రవణంచేసిన కారణంగా పండరీపురం వెళ్ళి పాండురంగణ్ణి దర్శించాలని కోర్కె కలగటం, వెంటనే ప్రయాణమై కాళ్ళు లేకపోయినా కూడా ప్రాకుకుంటూ వెళ్ళటం ప్రారంభించాడు.

కొంతదూరం వెళ్ళేసరికి అలసిపోయాడు. ఆకలివేసింది. పండరీ నాథుని మనసారా ప్రార్థించాడు. తన కోరికను సఫలీకృతం చేయమని అర్థించాడు. భగవంతుడు దయామయుడు కదా! ఒక వర్తకుని రూపంలో కూర్మదాసుకు దర్శనమిచ్చి, అతనికి తోడుగా ఉంటూ, అతనికంటే ముందుగా వెళ్ళి ఆ గ్రామంలో వంటచేసి, ఆహార పదార్థాలన్నీ సిద్ధపరచేవాడు. అలా వారిద్దరూ కలసి బహుళాపురం వరకు చేరారు. అది కార్తీక మాసం. కార్తీక శుద్ధ ఏకాదశినాడు పాండురంగని దర్శనం చేయాలన్నది కూర్మదాసు సంకల్పం. ఇంకా మూడురోజులు మాత్రమే వ్యవధి ఉన్నది.

తాను ప్రాకుతూ వెళ్ళి పండరీపురం చేరి, పాండురంగని దర్శనం చేసుకోవటం అసంభవం. అందువల్ల పండరీపురం వెళ్ళే సాధువులను ప్రార్థించి, ఎలాగైనా తన వంతు ప్రణామాలను పాండురంగనికి అందించ వలసినదిగా ప్రార్థించాడు. తనకి కూడా ఎలాగైనా దర్శన భాగ్యం కలిగేలా చేయమని వారితో విన్నవించుకున్నాడు. భగవంతునికి చేసిన ప్రార్థన ఎన్నడూ వ్యర్థం కాదు సుమా!

పండరీపురంలో రంగడు నామదేవునికి సాక్షాత్కరించి, నామదేవుడు, జ్ఞానేదేవులతో కలసి, కూర్మదాసుని అనుగ్రహించ డానికి

పయనమయ్యాడు. ఇంతలో పాండురంగడు నామదేవుడు, జ్ఞానదేవుల ఇద్దరినీ అక్కడ వదిలిపెట్టి తాను సమీపంలోనే ఉన్న సామంతుడనే భక్తునికి దర్శనమిచ్చి, ఆ భక్తునితో మాట్లాడుతూ "భక్తా! ఎవరూ దర్శింప వీలుకాని ప్రదేశంలో నన్ను దాచిపెట్టు. నన్ను దొంగలు తరుముతున్నారు" అని చెప్పాడు. వెంటనే సామంతుడు తన రొమ్మును చీల్చి తన హృదయ కుహరంలో పాండురంగణ్ణి వశించమని అర్థించాడు. పండరీనాధుడు వెంటనే అతని హృదయగుహలోకి ఆశీనుడయ్యాడు. సామంతుడు తన రొమ్మును ఒక వస్త్రంతో కప్పి ఉంచాడు.



ఇంతలో నామదేవుడు, జ్ఞానదేవుడు రంగణ్ణి వెతుక్కుంటూ అక్కడకి రావటం తటస్థించింది. పండరీనాధుడు సామంతుని హృదయ మందిరంలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడి నుండి పండరీనాధుడు సామంతుడు, నామదేవుడు, జ్ఞానదేవులతో కలసి కూర్మదాసుని అనుగ్రహించటానికి బహుళాపురం చేరుకున్నారు.

పాండురంగడు కూర్మదాసుకు అక్కడ తన నిజరూపంతో దర్శనమిచ్చాడు. కూర్మదాసు పండరీనాధునికి నమస్కరించి ప్రార్థిస్తూ "నాకు ప్రసాదించిన ఈ నిజరూప దర్శనాన్ని యీ గ్రామంలో భక్తులందరికీ కూడా ఎల్లవేళలా ప్రసాదించవలసినది" అని వేడుకున్నాడు. ఆ భక్తుని ప్రార్థనా ఫలితంగా పండరీనాధుని దర్శనం బహుళాపురంలో నేటికీ అందరికీ లభిస్తోంది!

# యోగవాశిష్ఠము

(గత సంచిక తరువాయి) - సుషుమ్నా ప్రసాద

## శిఖిధ్వజుని కథ

శిఖిధ్వజుడు వెంటనే జింక చర్మాన్ని జపమాలను, కుశగ్రాసమును, మట్టిపాత్రలను, చెక్క పాత్రను పోగుచేసి, వాటిని యెండిన కలపతో నిప్పంటించాడు, తను తలదాచుకొనే యెండుటాకుల కుటీరమునకు నిప్పంటించాడు. అతను కుంభమునితో యిలా చెప్పాడు "ఇప్పడు నేను సత్యమైన, పరిపూర్ణమైన త్యాగమును సాధించాను", ఓ దివ్య కుమారా! నేనింకా త్యజింపవలసిన దేమైనా వున్నదా? నేనిప్పడేమి చేయాలి? కుంభముని యిలా సమాధానము చెప్పాడు "నిన్ను చూస్తే జాలేస్తున్నది", నీవేమి వదులుకోలేదు.



శిఖిధ్వజుడు తనలో తనిలా అనుకొన్నాడు, "నాకిప్పడు రక్త మాంసములతో, బొమికెలతో కూడిన యీ శరీరము తప్పయింకే మున్నది, నేను వెంటనే పర్వత శిఖరము నెక్కి, అక్కడ నుండి హుటాహుటిన క్రిందకు దూకి, యీ శరీరము ముక్కలు ముక్కలుగా, విచ్ఛిన్నమయేట్లు చేస్తాను. అలా అంటూ, పర్వత శిఖముపై కెక్కి, అక్కడ నుండి క్రిందకు దూకటానికి సంసిద్ధుడైనాడు, కుంభముని వెంటనే అతనినాపు జేసి యిలా అన్నాడు.

"నీ వెంతటి వివేకహీనమైన పని చేస్తున్నావు? నీకేమి హాని చేసిందని యీ అమాయక దేహమునంతమెుందించాలను కొంటున్నావు? నీవాత్మ జ్ఞానమును పొందుటకీ శరీరము యేమి అంతరాయము కలిగించింది? సత్యమైన, పరిపూర్ణమైన పరిత్యాగమంటే, శరీరాన్ని ధ్వంసం చేయటంకాదు. ఈ శరీరాన్ని కదలించి, కలత చెందేట్లు చేసి, జన్మ, కర్మబీజమును తయారు చేసే, శత్రువొకటి వున్నది. నీ

శరీరమునకు హాని చేసే శత్రువును జయిస్తే, నీవు నిజంగా అన్ని వదలివేసినట్లు, అదే సర్వసంగ పరిత్యాగము.

శిఖిధ్వజుడు మరల ప్రశ్నించాడు, ఓ కుంభమునీ! నా శరీరమును కలవరపెట్టే దేమిటి? ఈ పునర్జన్మలకు మూలమేమిటి? కాబోయే జన్మలలో కర్మలకు, బాధలకు మూలమేమిటి? అన్ని పరస్పర విరుద్ధంగా గోచరించే యీ విశ్వంలో దేనిని విసర్జిస్తే, అన్నిటినీ విసర్జించినట్లవుతుంది? ఓ దివ్య కుమారా! ఈ శరీరమును కదలించి, కలత పెట్టే దానిని, యేవిధంగా విసర్జించగలనో తెలయజేయవలసినది.

అప్పడు కుంభముని యీ విధంగా సమాధానమిచ్చాడు "మనసే అన్ని కష్టాలకు, కలతలకు, బాధలకు మూలకారణము, జీవము, ప్రాణము, బుద్ధి, అహంకారముల ద్వారా అది క్రియాకలాపము చేస్తున్నది, మనసు నుండి సంకల్పాలు వుత్పన్నమవుతున్నాయి. తద్వారా జీవునికి వునికి లేని (మాయా సహితమైన) వస్తువులతో అనుబంధమేర్పడేట్లు చేస్తున్నది.

మనసే మాయకునివాసము, శరీరమునకు మూలమదే, అది కదిలేదికాదు, కదలందికాదు, ఇలా నిరంతరమూ చలించే మనసే జగత్తును సృష్టిస్తున్నది. మనసే బంధానికి కారణం. ఏవిధంగా గాలి వృక్షాన్ని కదిలిస్తుందో, అలాగే మనసు శరీరాన్ని కదలిస్తుంది. ఈ టక్కరి మనసే, అన్ని కర్మలకు మూలకారణము. ఎవరైతే మనసుకు లోబడివుంటాడో, అతనికి చింతలు, కలతలు, కష్టాలు, బాధలు తప్పవు. కనుక మనసును వదిలివేసినట్లయితే, యీ ప్రపంచములో, అన్నిటినీ వదిలివేసినట్లే, మనసునదుపులో (మనోనిగ్రహము) పెట్టుకోవటమే నిజమైన పరిత్యాగము, అది వొక్కటి మాత్రమే నిత్యానందమును, ఆత్మజ్ఞానమును పొందటానికి దోహదం చేస్తుంది. ఆత్మ జ్ఞానము పొందినప్పడు, నీవే బ్రహ్మము లేక పరమాత్మవు, తద్భిన్నమైన దేమిలేదని గ్రహిస్తావు.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**ఆగస్ట్ 2017**

04 శుక్ర - వరలక్ష్మీ వ్రతము.

05 శని - శని త్రయోదశి.

07 సోమ - రాఖీ పూర్ణిమ, శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.(రాత్రి పాక్షిక చంద్ర గ్రహణం)

14సోమ - శ్రీ కృష్ణ జన్మాష్టమి - ఉదయం కలశ స్థాపన; శ్రీరాధాకృష్ణ సహస్రనామార్చన; భక్త సమారాధన; రాత్రి 7గం।లకు శ్రీ సద్గురు పాద పూజ.

15 మంగ - స్వాతంత్ర దినోత్సవం. ఉదయం 11గం।లకు శ్రీ రాధాకృష్ణ సామూహిక పూజలు, భక్త సమారాధన.

16 బుధ - ఉదయం 11గం.లకు శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన. రాత్రి 7 గం॥లకు ఉట్టి కొట్టుట

17 గురు - శ్రీ గురు దశమి- సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

18 నుండి 24 వరకు మౌన ధ్యాన సప్తాహములు

19 శని - శని త్రయోదశి

20 ఆది - మాస శివరాత్రి. , పావులూరు శాఖలో ఏకాహం.

21 సోమ - అమావాస్య.

25 శుక్ర - వినాయక చవితి - ఉదయం 5-30ని॥లకు శ్రీసద్గురు పాదపూజ, 11గం.లకు సామూహిక వినాయక పూజలు, భక్తసమారాధన.

**సెప్టెంబర్ 2017**

05 మంగ - టీచర్స్ డే - శ్రీ సద్గురు పాద పూజ, గురుకుల సాంస్కృతిక కార్యక్రమాలు.

06 బుధ - భాద్రపద పౌర్ణమి - శ్రీసద్గురు పాదపూజ.

15 శుక్ర - శ్రీ గురు దశమి, సత్సంగం,శ్రీ సద్గురు పాద పూజ.

18 సోమ - మాస శివరాత్రి, పావులూరు శాఖలో ఏకాహం.

20 బుధ - అమావాస్య.

**సెప్టెంబర్ 21 గురువారం నుండి అక్టోబర్ 1 వ తేదీ సోమవారం వరకు శ్రీ శరన్నవరాత్ర మహోత్సవములు.**

21 గురు - దీక్షా స్వీకారం, అఖండ జ్యోతి ప్రజ్వలనము.

27 బుధ - మూలా నక్షత్రం, శ్రీ సరస్వతీ పూజ.

28 గురు - శ్రీ దుర్గాష్టమి .

29 శుక్ర - మహర్నవమి, శ్రీ జగన్మాత సామూహిక కుంకుమ పూజలు.

30 శని - విజయ దశమి -శ్రీ జగన్మాత సామూహిక కుంకుమ పూజలు,అన్నప్రాసనలు, అక్షరాభ్యాసాలు.

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

"నీకు ఎంతో ప్రియమైనది, విలువైన వస్తువు తాత్కాలికంగా కనిపించలేదనుకో ఎంతో ఆవేదన చెందుతావు. దానిని అన్వేషించటానికి ఎంతో శ్రమిస్తావు. చివరికి ఆహారం తినటం కూడా త్యాగం చేస్తావు. ఆఖరుకు ఆ వస్తువు నీకు గోచరించిందనుకో, నీ ఆనందానికి అవధులుంటాయా? అయితే ఆ వస్తువు నీకు ఎక్కడి నుంచి వచ్చింది? నీ దగ్గరే ఉన్నది కదా! నీ వద్ద ఉన్న వస్తువును నీవు గుర్తించ గలిగావు.



దానినే సిద్ధి అంటారు. అంతేకాదు దానిని సాక్షాత్కారము అనవచ్చు కదా! తప్పులేదు కదా!

అలాగే భగవానుడు నీ కంటికి గోచరించడు కదా! ఆయనకోసం ఎందుకు అన్వేషణ చేయరు? కంటికి గోచరించటానికి అదేమీ వస్తువు కాదు కదా! పోనీ ఏదైనా క్రియ ద్వారా గుర్తించటానికి అది క్రియారహితమైనది కదా! అలాగని జడము కాదు కదా! అన్ని క్రియలకు ఆధారమైనది. ఎందువలన ఆత్మవస్తువుని గుర్తించలేక పోతున్నావు? అది నీకు భిన్నంగా లేదు కాబట్టి. అది నీలోనే ఉన్నది. నీతోనే ఉన్నది. నీ కన్నును నువ్వు దర్శించ గలుగుతావా? అలాగే ఆ ఆత్మవస్తువును కూడా దర్శించలేక పోతున్నావు.

నీ వీపు మీద ఈగ వ్రాలింది. దాన్ని నువ్వు చూడలేవు. కానీ స్పర్శ ద్వారా గ్రహించగలుగుతావు. అదే అనుభూతి. అలాగే ఆత్మానుభూతి లేక ఆత్మజ్ఞానము అనేది అనుభవమేగాని, భావన కాదు. అది ఇంద్రియాలకు, దేహానికి, మనస్సుకు, బుద్ధికి అందేది కాదు. దాని అనుభూతిని అనుక్షణం పొందనివారెవరైనా ఉన్నారా? అలాంటి వారెవరైనా ఉంటే వారికి ఏడుకట్ల సవారి తప్పదు కదా!

పంచదార నోట్లో వేసుకోగానే మధురానుభూతిని పొందుతావు. దానిని ఎవరికైనా చూపించగలుగుతావా? అసంభవము. ఈ అనుభూతి తాత్కాలికమైనది. కానీ ఆత్మానుభూతి అలాకాదు. అది పొందిన తరువాత అదృశ్యమయ్యేది కాదు. ఎవరైనా 'నేను ఆత్మానుభూతిని పొందాను' అంటే అది అసత్యమే అవుతుంది. సాధనలో పొందే అనుభూతులన్నీ మనస్సు ద్వారా పొందేవే కనుక అవన్నీ

తాత్కాలికమే సుమా!

ఆత్మానుభూతి అనేది అమనస్క స్థితి. అక్కడ స్పందన ఉండదు. అన్యభావన ఉండదు. సంకల్ప వికల్పాలకు తావు లేదు. అభావ స్థితి. మనస్సు అంతర్ముఖమవుతుంది కాబట్టి దేహానికి విలక్షణ స్థితి. వాసన లేదు కాబట్టి గుణాల ప్రేరణ ఉండదు. అవస్థలు ఉన్నా, వాటికి సాక్షిగా వుంటాడు. 'క్వచిత్ స్పర్శం న కుర్వన్తి నళినీదళ మంభసా' అన్నట్లుగా వుంటుంది ఆ స్థితి. ఆ స్థితిలో ఉన్నవాడు జీవన్ముక్తుడు. అతనికి మరణం లేదు. జన్మ ఉంటే మరణం తప్పదు. అందువలన మరణం లేకుండా చేసుకోవాలంటే జన్మలేకుండా చేసుకోవాలి. వేరొక మార్గం లేదు. అది కేవలం సద్గురు సమాశ్రయం ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది. ఆయన ప్రేమకి పాత్రుడవ్వాలి అంటే అధికారివి కావాలి. ఇంకా వివరంగా చెప్పుకోవాలంటే గురుబిడ్డవి అవ్వాలి. అప్పుడే ఆయన అనుగ్రహాన్ని నీవు జుర్రుకో గలుగుతావు" అన్నారు శ్రీగురుదేవులు.

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

ఆగస్ట్ 2017

07 సోమ - రాఖీ పౌర్ణమి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

14 సోమ - శ్రీ కృష్ణ జన్మాష్టమి - రాత్రి 7గం।లకు శ్రీ సద్గురు పాదపూజ ఉట్టి కొట్టుట.

17 గురు - శ్రీ గురు దశమి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాదపూజ.

25 శుక్ర - వినాయక చవితి - ఉదయం 11గం.లకు వినాయక పూజ శ్రీసద్గురుపాదపూజ.

సెప్టెంబర్ 2017

06 బుధవారం - భాద్రపద పౌర్ణమి - రాత్రి 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ

15 శుక్రవారం - శ్రీగురుదశమి, రాత్రి 7 గం॥లకు శ్రీ సద్గురు పాదపూజ.

27 బుధవారం-మూలా నక్షత్రం, సరస్వతీ పూజ; ఉదయం 11గం.లకు కుంకుమ పూజలు.

28 గురువారం- దుర్గాష్టమి - ఉదయం 11గం.లకు కుంకుమ పూజ.

29 శుక్రవారం- మహర్నవమి - ఉదయం 11గం.లకు కుంకుమ పూజ.

30 శనివారం - విజయ దశమి - ఉదయం 11గం.లకు కుంకుమ పూజ శ్రీసద్గురుపాదపూజ.

# భక్తిరేవ గరీయసి

- రమణ ప్రసాద్

భక్తితో భగవంతుడిని కొలిస్తే మానవులే కాదు. పశు పక్ష్యాదులు కూడా తరించినట్లు మన ఇతిహాసాలు చెబుతున్నాయి. శ్రీ కాళహస్తీశ్వరుడిని కొలిచి, ఏనుగు, పాము, సాలీడు తరించాయి. ఏ శాస్త్రజ్ఞానము లేని తిన్నడు అనే బోయవాడికి కాలహస్తీశ్వరుడు ప్రత్యక్షమై తన అనుగ్రహాన్ని అతనిపై వర్షింపచేశాడు. అతడే "కన్నడు" అని ప్రసిద్ధి గాంచాడు. భగవత్సాక్షాత్కారానికి మంత్ర తంత్రాలలో ప్రవేశం , శాస్త్రజ్ఞానం అక్కరలేదు. ఈ విషయం శ్రీ కాళహస్తీశ్వర శతకంలో చెప్పబడింది-

ఏ వేదంబు పఠించె లూత? భుజగంబే శాస్త్రములఙ్చాచె,దా
నే విద్యాభ్యాసంబొనర్చెఁగరి, చెంచేమంత్రమూహించె, బో
ధావిర్భావ నిదానముల్ చదువులయ్యా? కావు ! మీ పాద సం
సేవాసక్తియె కాక జంతుతతికిన్ శ్రీకాళహస్తీశ్వరా!

" శ్రీ కాళహస్తీశ్వరా! జ్ఞానము నీ పాదసేవానురక్తి వలననే కలుగుతుంది కాని చదువుల వల్ల కాదు. మంత్ర తంత్రములు, వేద విజ్ఞానం ఫలాన్ని ఇవ్వలేవు. నీ పాద సేవ చేతనే, సాలె పురుగు, ఏనుగు, పాము, బోయవాడు ప్రగాఢమైన ప్రేమతో భగవద్దర్శనం పొందిన భక్తులు."

"భక్తి చేయలేనిది ఏదీ లేదు" అని శ్రీ శంకర భగవత్పాదాచార్యులవారు శివానందలహరిలో ధృవీకరించారు-

మార్గావర్తిత పాదుకా పశుపతేరంగస్య కూర్చాయతే
గండూషాంబు నిషేచనం పురరిపోర్దివ్యాభిషేకాయతే
కించిద్భక్షిత మాంస శేష కబళం నవ్యోపహారాయతే
భక్తిః కిం?నకరోత్యహో! వనచరో భక్తావతంసాయతే

"బోయవాడు పుక్కిట పట్టిన నీటితో చేసిన అభిషేకానికి శివుడు ఆనందించాడు. వేట మాంసం తెచ్చి కొద్దిగా రుచి చూసి చేసిన నివేదనను శివుడు ఆప్యాయంగా స్వీకరించాడు. కాళహస్తీశ్వర లింగం కంటినుండి నీరు కారుతుంటే కంటి వద్ద గురుతుగా తన చెప్పుకాలు పెట్టి, తన కను గ్రుడ్డు తీసి అమర్చాడు. అతని భక్తికి మెచ్చి శివుడు సాక్షాత్కరించాడు. ఆ బోయవాడు భక్తాగ్రగణ్యుడై "కన్నప్ప" గా పిలువబడ్డాడు. అహో! భక్తి సాధింపలేని కార్యముండదు కదా!"

ఎవరైతే నిర్మలమైన మనస్సులో భగవంతుని నిలుపుకుని ధ్యానిస్తారో, వారికి భగవంతుడు సగుణరూపంలో సాక్షాత్కరిస్తాడు. ధృవుడు అనే బాలుడు అలా తపస్సు చేసి భగవత్సాక్షాత్కారం పొందాడు. అతనికి "ఓం నమో భగవతే

వాసుదేవాయ" అనే ద్వాదశాక్షరిని నారదులవారు ఉపదేశించారు. ధృవుడు ఆ మంత్రాన్ని నిష్ఠగా ధ్యానించగా నారాయణుడు సాక్షాత్కరించి వరం కోరమంటే, దర్శనానందంలో మునిగి ఉన్న ధృవుడు తను దేనికోసం తపస్సు చేశాడో మర్చిపోయాడు. ప్రపంచ విషయాలు అతనికి తుచ్ఛంగా తోచాయి. శ్రీమన్నారాయణుడే అతనికి కోరిన వరాలనిచ్చి పట్టాభిషిక్తుణ్ణి చేశాడు.

ఇంక గజేంద్రుని విషయానికి వస్తే- అతనికి భగవంతుడు ఎక్కడ ఉంటాడో,ఎలా ఉంటాడో తెలియదు. తన పరివారంతో కలిసి స్నానం చేస్తుంటే, ఒక మొసలి అతడిని పట్టుకొంది. అతని పరివారం అతడిని విడిచి వెళ్ళిపోయింది. వేయి సంవత్సరాలు మొసలితో పోరాడి అలసిపోయాడు. ఎవరిచేత ఈ జగత్తు పుడుతోందో, ఎవరిలో లయమవుతోందో ఆపరమేశ్వరుని శరణు పొందాలనే నిర్ణయానికి వచ్చాడు. "లోకాలు, లోకేశులు, లోకస్థులు దాటిన తరువాత అలోకమైన చీకటి కావల ఏకాకృతిగా వెలిగే వాడిని సేవిస్తాను" అని తలిచాడు. ఎంత వేడినా భగవంతుడు రాకపోతే గజేంద్రుడికి సందేహం వచ్చింది-

"కలడందురు దీనులయెడ, గలడందురు పరమయోగి గణముల పాలం గలడందురన్ని దిశలను గలడు కలడనెడువాడు కలడో లేడో" అని. ఎప్పుడైతే అతని మొర చెవిన పడిందో, క్షణమైనా ఆలశ్యం చేయకుండా వచ్చి, మకరిని పరిమార్చి, గజేంద్రుడిని రక్షించాడు.

ఎవరైతే ఎన్ని కష్టాలనైనా సహించి, ఎన్ని యాతనలైనా అనుభవించి భగవన్నామం చేస్తారో, వారికి భగవద్దర్శనం లభిస్తుంది. తండ్రి హిరణ్యకశిపుడు మరణయాతనలు పెట్టినా సహించాడు. ప్రహ్లాదుడు. హరినామం వీడలేదు. ఎవరైతే తను మన ధనాలను భగవంతునికి అర్పిస్తారో వారికి భగవంతుడు సాకార రూపంలో దర్శనమిస్తాడు.

ఈ కలియుగంలో భగవత్ సాక్షాత్కారం పొందిన భక్తులు కోకొల్లలు. కబీర్, మీరా, రామదాసు, శ్రీరామకృష్ణ పరమహంస, శ్రీబాబూజీ మహరాజ్ మున్నగువారు. భగవంతుడు భక్తులకు దర్శనమివ్వటమే కాక వారు సమర్పించిన పదార్థాలను ప్రీతిగా స్వీకరించారు. ద్రౌపది, శబరి, విదురుడు ఇందుకు తార్కాణం. శరణాగతిచేత భగవంతుని దర్శించవచ్చును.

దీనికి కావలసినది - భగవంతుడిని పొందటానికి తీవ్రమైన ఆరాటం, గాఢమైన ఆవేదన.

# శ్రీ కృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

ద్వితీయాశ్వాసము 98 శ్లో॥

పీఠే పీఠ నిషణ్ణ బాలకగళే తిష్ఠన్సకో గోపాలకో
యన్త్రాన్తః స్థిత దుగ్ధ భాణ్డ మవకృష్యాచ్ఛాద్య ఘణ్టారవమ్
వక్త్రోపాన్త కృతాంజలిః కృతశరకమ్యంపిబన్యః పయ
పాయాదాగత గోపికా నయనమోర్గణ్డూష పూత్కారకృత్ ॥

తాత్పర్యము -



పీట మీద పీట, దాని దొంతర మీద నిలిచిన వాడై పాలకడవను వంచి గంట మ్రోతను నిలిపి నోటి దగ్గర దోసిలి పెట్టుకుని పాలు త్రాగుతున్నవాడు, ఇంతలో వచ్చిన గోపికల కన్నుల మీద పుక్కిలించి, ఉమిసినవాడైన ఆ ఆలకాపరి కుర్రవాడు కాపాడుగాక!

తలుపు ఓరగా తెరచి ఉంది. ఆ సందులో నుండి గొల్లపిల్ల కాయలు 1,2,3,4,5 తలకాయలు లోపలికి పెట్టి, అంతా కలయ చూశారు - 'లోపల ఎవరూ లేరు కితన బావా!' అని చెబుతుంటే, వాళ్ళ నాయకుడు చిన్ని కృష్ణుడు 'సరే పదండి' అని, తాను వెనకే వెళ్ళాడు. చుట్టూ చూశారు అందరూనూ. ఎత్తుగా ఉన్న ఉట్టిమీద పాల కడవ, వెన్నదుత్త కనిపించాయి. అది కదిపితే చప్పుడయ్యేటట్లుగా గంట కూడా కట్టి ఉంది దానిమీద గడసరి గోపమ్మ. గంట మ్రోగగానే ఎలుకలన్నీ లోపలే ఉంటే పిల్లివచ్చి వాటన్నిటినీ పట్టుకున్నట్లుగా, వచ్చి తనను పట్టుకోవాలని గోపమ్మ ఆలోచన.

శ్రీకృష్ణు డు ప్రక్కనే ఉన్న పీటల దొంతరను చూశాడు. వాటిని ఒకదానిమీద ఒకటి అమర్చినా కూడా ఎత్తు చాలలేదు. వాటి మీద పిల్లలను ఒకడి మీద ఒకడిని వంగోబెట్టి ఎత్తు సరిపోయేవరకు అలా అమర్చి, ఆఖరి పిల్లవాడి మీద కృష్ణుడు ఎక్కి ఉట్టిని అందుకున్నాడు. గంట మ్రోగకుండా చేత్తో పట్టుకుని, పాటు త్రాగుతూ తల వూపుతూ

ఆనందంగా వున్న సమయంలో తలుపు చప్పుడయింది. గోపమ్మ రానే వచ్చింది. పిల్లలంతా దూకి పారిపోయారు. కృష్ణుడు ఒక్కడు పట్టుబడి పోయాడు.

'మీ అమ్మతో చెబుతా ఉండు!' అంటూ బెదిరిస్తూ కృష్ణుణ్ణి ఆ గోపిక పట్టుకొనే సరికి ఆ స్పర్శతో ఆమెకు ఒళ్ళు ఝల్లుమన్నది! ఆ పైన కృష్ణుడు పాలు పుక్కిట పట్టి ఆమె కళ్ళమీద ఊశాడు. ఆవిడకి కళ్ళు కనిపించలేదు. తీరా ఆవిడ ఏ భోషాణం మీద పడుతుందో అని జాలి వేసి కృష్ణుడు తన సుకుమారమైన చేతులతో ఆమె కళ్ళు తుడిచాడు. గోపెమ్మకు కళ్ళు కనబడటమే కాదు, కృష్ణుడు కూడా కనిపించాడు.

"నా చిట్టి తండ్రీ! నా బంగారు కొండ!" అంటూ వాడిని పట్టుకుని ఆనందంగా నృత్యం చేయసాగింది గోపమ్మ. అలాటి కరుణామూర్తిని ఆ చిన్ని కృష్ణుడు మనలను కాపాడు గాక!!

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల పరిచితులు, ప్రియతమ భక్తులు, ముంజవరపుకొట్టు గ్రామ వాస్తవ్యులు అయిన శ్రీ తమ్మన వెంకట నారాయణగారు 6-7-2017 గురువారంనాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 94సంవత్సరాలు.

సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి బంధుమిత్రులకు, కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము!

# చిన్ముద్ర

- పరాశర ప్రసాద్

'యజ్ఞాత్వా నేహభూయోన్యత్ జ్ఞాతవ్యమవశిష్యతే' - అన్నట్లుగా ఏది తెలిసికొంటే ఇహ తెలిసికోవలసినది మిగిలి ఉండదో అట్టి నామరూప క్రియా గుణ రహితమైన బ్రహ్మతత్వబోధను శ్రీసద్గురుదేవులు తమను ఆశ్రయించిన శిష్యులకు చిన్ముద్ర లేక జ్ఞానముద్ర రూపంలో తెలియ జేస్తారు. ఏదైనా వస్తువును వర్ణన చేయాలంటే దానిపేరు, జాతి, గుణము క్రియను వివరించవలసి ఉంటుంది. కాని పరతత్త్వం వస్తువుకాదు. జాతివాచక, నామవాచక, గుణవాచక, క్రియవాచక శబ్దములతో వర్ణించ డానికి వీలులేదు కాబట్టి అవాఙ్మానస గోచరమైన దానిని చిన్ముద్రతో తెలియజేస్తారు.



చిన్ముద్ర అంటే అంగుష్టము అనగా బొటనవ్రేలుతో తర్జనీ అంటే చూపుడువేలుని కలిపి చూపించటం అన్నమాట.

చిన్ముద్ర జీవబ్రహ్మైక్య బోధకమైన తత్త్వమసి మహావాక్యార్థమును తెలియ జేస్తుంది.

అంగుష్టము 'తత్'పద చిహ్నము. తర్జని 'త్వమ్'పద చిహ్నము. ఈ రెండు సంయుక్తమవ్వటమే 'అసి' అన్నపద భావము. చూపుడు వేలు జీవుడికి చిహ్నము. మధ్యవేలు, ఉంగరపువేలు, చిటికనవేలు స్థూల సూక్ష్మ కారణ దేహాలకు చిహ్నము. చూపుడువేలుతో పోల్చబడిన జీవుడు ఈ దేహాలను త్యజించి, బొటనవేలుతో పోల్చబడిన బ్రహ్మమునే ఆశ్రయించి ఉండాలన్నదే ఈ చిన్ముద్రకు అర్థము.

సద్గురుమూర్తి చిన్ముద్ర ద్వారా అందజేసిన జ్ఞాన సందేశాన్ని జీవుడు గ్రహించి, పుట్టుట, పెరుగుట, రోగాలతో పీడింపబడుట అనే పరిణామాత్మక క్రియలకు కారణమైన స్థూలదేహానికి విలక్షణంగా వుండాలి. అంతే కాదు సూక్ష్మదేహం ద్వారా ఇంద్రియ వ్యాపారాలు నిర్వహిస్తూ కోరికలు పెంచుకుంటూ, జగత్ సత్యం అనే భావనతో వుంటే

తన జీవితానికి కారణమైన సూక్ష్మశరీరము, దాని ద్వారా సంసార సాగరంలో కూరుకుపోయి అజ్ఞాన ప్రవృత్తికి కారణమైన కారణ శరీరానికి విలక్షణంగా ఉండాలనే సద్గురుదేవుల సందేశము.

అంతేకాదు జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనే మూడు అవస్థలలోని అనుభవాలన్నీ దుఃఖహేతువులనేది గ్రహించి ఆ అవస్థలతోటి సంపర్కము బంధకారణమని గ్రహించి, వాటికి సాక్షిగా ఉండాలన్నదే చిన్ముద్ర ద్వారా శ్రీసద్గురుదేవులు అందించే సందేశము.

చిన్ముద్ర అనేది జ్ఞాన ముద్ర. సద్గురుమూర్తి నీ యదార్థస్థితిని తెలియజేసే జ్ఞానముద్ర. పరతత్త్వాన్ని ప్రత్యక్షంగాగాని, అనుమాన ప్రమాణాలతో గాని తెలియజేయటానికి వీలులేనిది. అందువలననే దానిని అందుకోవాలంటే శ్రీసద్గురుమూర్తి అందించే జ్ఞానముద్రే శరణ్యం!!



# శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు

# శ్రీ పరమానందయ్య శిష్యులు

- రమణ ప్రసాద్

శ్రీ పరమానందయ్యగారికి తనశిష్యుల పైన ఎంతో ప్రేమ. వారి శిష్యులు తమ గురువుగారి పైన ఎంతో వినయ విధేయతలు భక్తి కలిగినవారు. గురువుగారు ఏది ఆజ్ఞాపిస్తే అది వెంటనే చెయ్యటమే కర్తవ్యంగా భావించేవారు. అయితే వారు చేసే అవక తవక పనులు అందరికీ నవ్వు తెప్పిస్తాయి. అలాంటిదే ఈ కథ .....



**గురువుగారి విందు భోజనం -**

పరమానందయ్యగారు ఒక కార్తీక సోమవారంనాడు శిష్యులతో వన భోజనానికి బయలుదేరారు. అక్కడ వంటలు చేసే పని తన శిష్యులకు పురమాయించారు. వంట ప్రారంభమయింది. ఒక శిష్యుడు పొయ్యి మీద బియ్యం పెట్టి అన్నం ఉడుకుతుంటే తాళం వేస్తూ కూని రాగాలు తీస్తున్నాడు. అతనికి సంగీతం అంటే అభిమానం మరి. అన్నం వుడుకుతుంటే గుడ గుడమని శబ్దం వస్తోంది. "ఓహో !ఇది తాళయుక్తంగా రాగాలు తీస్తోందే" అని వినసాగాడు. ఆ శబ్దం తాళానికి అందటం లేదు. తాళం తప్పుతోంది. ఎంత చెప్పినా ఆ శబ్దం అలానే రావటంతో దుడ్డు కఱ్ఱతో ఒక్కటి వేశాడు. కుండ పగిలి అన్నం బూడిద పాలైంది. "గుడ గుడ శబ్దం కుండకు నష్టం" అని అక్కడనుంచి తప్పుకున్నాడు.

మరొక శిష్యుడు కూరగాయలు తేవటానికి పోయాడు. "వంకాయలు వాతం, బీరకాయ బలుపు, సొరకాయ జలుబు, కాకరకాయ వేడి" అని సర్వరోగ నివారిణి అయిన మూడు కేజీల కరక్కాయలను కొనుక్కొచ్చాడు.

మూడవతనికి శకునాల పట్టింపు. అతను ఆకులు తేవటానికి వెళ్ళాడు. చెట్టు ఎక్కి ఆకులను కొయ్యబోయేంతలో ఎవరో తుమ్మారు. చెట్టు దిగబోయేంతలో మళ్ళీ ఎవరో తుమ్మారు. అంతే!అతను చెట్టు మీదే ఉండిపోయాడు.

మరి కొంతమంది శిష్యులు మజ్జిగ తేవటానికి వెళ్ళారు. ఒక ఇల్లాలు వారిని పిలిచి మజ్జిగ తేవటానికి లోపలకు వెళ్ళింది. మజ్జిగ తెచ్చేంతలో ఆమెకు వారి సంభాషణ ఇలా వినిపించింది - ఒకడు అక్కడ ఉన్న గేదెను చూసి,“ ఇది చస్తే బయటకు ఎలా తీసుకు వెళ్ళాలి? గుమ్మం పట్టద్దా?” అనే సందేహం వెలిబుచ్చాడు. “దీన్ని ఇక్కడే గొయ్యి తీసి పాతేద్దామ”ని ఒకడు, “దీని కొమ్ములు కోసేస్తే చాలు” అంటుంటే - ఆమెకు చిర్రెత్తుకొచ్చి “మీ బుద్ధులు పోనిచ్చుకొన్నారు కాదు” అని వాళ్ళను బయటకు గెంటేసింది.

రెండు ఝాములకు ఆకలితో భోజనం చెయ్యటానికి గురువుగారు వచ్చారు. ఇంకేముంది! అందరూ దిగాలుగా కూర్చున్నారు. భార్యా సమేతంగా విందు భోజనానికి వచ్చిన గురువుగారి పరిస్థితి అయెమయంలో పడిపోయింది!!

## టాల్‌స్టాయి ఔదార్యం

ఒక వనిత తాను ఉన్న హొటల్ నుండి బయటకు వచ్చి అక్కడ నుంచొని ఉన్న ఒకనికి తన సామాన్లు అందించి, “ఈ సామాన్లు స్టేషన్‌కు త్వరగా తీసికొనిరా! ట్రైన్ టైమ్ అవుతోంది అని చక చకా నడిచింది. ఆ వ్యక్తిసామాన్లు తెచ్చి ట్రైన్‌లో ఆమె కంపార్ట్‌మెంట్‌లో పెట్టాడు. ఆమె అతనికి కొన్ని రూబల్స్ ఇచ్చింది. ఇంతలో స్టేషన్‌లో ఉన్న కొందరు వ్యక్తులు వచ్చి ఆయనకు అభివాదం చేశారు. అప్పుడు ఆమె ఆయన ప్రసిద్ధ రచయిత “లియో టాల్‌స్టాయ్” అని తెలుసుకొని తన



తొందరపాటుకు ఎంతో విచారించింది. ఆమె టాల్‌స్టాయ్ వద్దకు వచ్చి తనను క్షమించమని కోరింది. టాల్‌స్టాయ్ చిరునవ్వుతో తల ఊపి, “మేడమ్! ఇట్సాల్‌రైట్! కాని మీరు ఇచ్చిన రూబల్స్ నా శ్రమకు ఫలితంగా నేను ఉంచుకుంటాను” అని తన కంపార్ట్‌మెంట్ వైపు నడిచాడు.

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

## భీమవరం తాతయ్యగారితో శ్రీబాబు

- విజయేశ్వరానంద ప్రసాద్

అనన్య భక్తితో సీతమ్మగారు శ్రీబాబు యిచ్చిన సూచనలను గ్రహించుకొని ఆచరించుకొన్నారు. అమ్మమ్మగారు ( తాతయ్యగారి ధర్మపత్ని), వారి కుమార్తెలు, కోడళ్ళు కూడ శ్రీబాబు యెడల భక్తిప్రపత్తులను పెంపొందించుకున్నారు. శ్రీ బాబు ఎప్పుడైనా వారింటికి వచ్చినప్పుడు వారందరూ శ్రద్ధగా సేవ చేసుకొనే వారు. అటువంటి సమయాలలో తాతయ్యగారు ఏదో పని కల్పించుకొని బయటకు వెళ్ళిపోయే వారు.



శ్రీబాబు అమీనా గారింట్లో ఉన్న రోజులలో చెల్లాయమ్మగారు ( తాతయ్యగారి వియ్యపురాలు) శ్రీబాబు కోసం నివేదన తయారు చేసి జయమ్మ గారింటికి తీసుకుని వెళ్ళి సమర్పించే వారు. అమీనా గారికి కొవ్వూరుకు బదిలీ అయ్యే వరకు యిలాగే జరిగింది.

ఒక రోజున అమ్మమ్మగారు, వారి పెద్ద కుమార్తె శేషమ్మగారు, చెల్లాయమ్మగారు వారి గురువుగారి జన్మ దినోత్సవమని, ప్రొద్దున్నే గురువుగారింటికి వెళ్ళి పోయారు. అక్కడ వాళ్ళు పగలంతా పూజలు, భోజనాలు, రాత్రి సంకీర్తన తెల్లవారుఝామున సుప్రభాతము ముగించుకుని మర్నాడు ఉదయానికి గాని తిరిగి రాలేదు. వాళ్ళు అలా వెళ్ళిన నాటి రాత్రి శ్రీబాబు తాతయ్యగారింటికి వచ్చారు. సీతమ్మగారు, చంపక మొదలైన వారు యింటిలో ఉన్నారు.

శ్రీబాబు యింటిలోనికి వచ్చి యిల్లంతా కలయ చూసి, “వీళ్ళెవరూ లేరా?ఓహో! మహా భక్తులు కదా! ఏ పూజకో వెళ్ళి ఉంటారు” అని ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ “నేను వెళ్ళి పోతున్నాను” అని

వాకిలి గుమ్మందాకా వెళ్ళారు. అందరూ నివ్వెరపోయి, శ్రీ బాబు వచ్చినట్లే వచ్చి వెళ్ళిపోతున్నారే అని దిగులు మొహాలు పెట్టారు.

గుమ్మం దాకా వెళ్ళిన శ్రీ బాబు , అక్కడ ఒక కుర్చీ వేసి ఉంటే దానిపైన కూర్చున్నారు. అందరి మొహాలు విప్పారాయి. శ్రీ బాబు సీతమ్మగారిని పిలిచి "అమ్మా! ఒక పళ్ళెము,చెంబుతో నీళ్ళు తీసుకు రా!" అన్నారు. ఆమె అలాగే చేశారు. "ఇప్పుడు నా పాదాలు ఎత్తి ఆ పళ్ళెంలో పెట్టి చక్కగా ప్రక్షాళన చేసుకో" అన్నారు.

ఆమె పాద ప్రక్షాళన చేస్తుంటే శ్రీబాబు "గురుర్బ్రహ్మా.........గురవే నమః" అని "చరణం పవిత్రం వితతం పురాణం......జాయతే స్ఫటికోపమః" అని పాదప్రక్షాళన మంత్రం చదువుతూ, శ్రీ గురు పాదోదకమును శిరస్సుపై చల్లుకోమని, అందరిపైన చల్లించారు. తమ పాదములను కళ్ళకద్దుకొని పళ్ళెములో నుండి తీయమని, శుభ్రమైన పొడి వస్త్రముపై ఉంచి, తడి లేకుండా తుడవమని చెప్పారు. "పూలు,కొబ్బరికాయ వున్నాయా?" అని అడిగారు.

ఆ రోజు గురువారం. మర్నాడు శుక్రవారం; సీతమ్మగారు తాము దీక్షగా చేసుకొనే అమ్మ పూజ కోసం సిద్ధం చేసుకొన్న ఐదు రకాల పూలు, కొబ్బరికాయ, పళ్ళు తదితర పూజా ద్రవ్యాలు అన్నీ తీసుకుని వచ్చారు. శ్రీ బాబు "ఇవన్నీ నీవు అమ్మ పూజ కోసం పెట్టుకున్నవి గదా? ఇలా వాడేస్తే ఎలా?" అన్నారు.

సీతమ్మగారు శ్రీబాబు పాదాలు పట్టుకొని "నా తల్లి దుర్గా దేవి యింత పరమానుగ్రహంతో యిలా వచ్చి కూర్చుని, నాతో స్వయంగా పూజ చేయించుకుంటున్నది. ఇంత కంటె వేరే పూజ ఏమున్నది బాబూ?" అని ఆనంద బాష్పాలు రాలుస్తూ అన్నారు. నీ పూజ ఫలిస్తుందిలే" అని శ్రీ బాబు అనుమతించారు.

- సశేషం

విష్ణు  కథలు

-గత సంచిక తరువాయి

# మీరాబాయి

- రమణ ప్రసాద్

**గురుమహిమ**

**మొహిలాగీ లగన్ గురుచరణన్ కీ ॥**
**చరణ్ బినా కఛువై నహిభావై జగ్ మాయా సబ్ సపనన్ కీ ।**
**భౌసాగర్ సబ్ సూఖ్ గయో హై ఫికర్ నాహి మొహి తరనన్‌కీ ॥**
**మీరాకె ప్రభు గిరిధర్ నాగర్ ఆస్ కహే గరుచరనన్‌కీ ।**



"గురుచరణాలపై నా మనస్సు నిలిచిపోయింది. నేను ఆ చరణాలనే నమ్మి ఉన్నాను. కనిపించే ఈ జగత్తు మాయే! స్వప్నమే! భవసాగరం ఎండిపోయింది. దానిని దాటాలంటే నాకు భయం లేదు. నాకు నా గురుచరణాలే శరణ్యం."

మీరా మరిది రాణా, ఆమె ఆడబడుచు ఊదాబాయి ఆమెను ఎన్నో కష్టాలకు గురిచేశారు. ఎన్నోసార్లు ఆమెను చంపాలని చూశారు. ఆమె ఏమీ లెక్కపెట్టలేదు. మనస్సులో "శ్యామ సుందరుడు ఉండగా నేను ఎవరికీ భయపడను" అని ఆమె అన్నిటిని మరచి శ్రీకృష్ణుని ఎదుట నాట్యం చేయటం మొదలుపెట్టింది.

**మై సావరేకే రంగ్ రాచీ ।**
**సాజి సింగార్ బాంధ్ పగ్ ఘుంఘురూ, లోకలాజ్ తజ్‌నాచీ ॥**
**గయీకుమతిలయీ సాధూకీ సంగతి, భగత్‌రూప్ భయిసాచీ।**
**గాయ్ గాయ్ హరికీ గుణ్ నిసిదిన్, కాలబ్యాలసూ బాచీ ॥**
**ఉణ్ బిన్ సబ్ జగ్ ఖారో లాగత్, ఔర్ బాత్ సబ్ కాచీ ।**
**మీరా శ్రీగిరిధరన లాల్‌సూ భగతి రసీలీ జాచీ ॥**

"నేను సింగారించుకుని గజ్జెలు కట్టుకొని శ్యామసుందరుని ఎదుట నాట్యం చేస్తాను. సిగ్గు,లజ్జ, కులమర్యాదలన్నింటిని త్యజించి

వేస్తాను. కుమతులకు దూరంగా ఉండి సాధుసజ్జనులలో కలిసి భగవన్నామం చేస్తూ నాట్యం చేస్తాను. ఈ విధంగా దివారాత్రాలు హరిని భజిస్తూ కాలరూపుడైన కాల సర్పంబారి నుండి బయట పడతాను. నాప్రభువు లేని ఈ జగత్తు నిర్జీవంగా తోస్తున్నది. భగవంతుని మాటలు కాక వేరు మాటలు వినను. భక్తిరసాంబుధిలో మునిగిపోతాను.”

**అసువన్ జల్ సీచ్ సీచ్ ప్రేమ బేలి బోయీ।**

**అబ్ తో బేలి ఫైల్‌గయి ఆనంద్ ఫల్ హెూయీ॥**

“ప్రేమ అనే మొక్కను నాటి అశ్రుధారలతో దానిని పెంచాను. ఇప్పుడది పెద్దదయి ప్రేమ పుష్పాలనిస్తోంది. కృష్ణ ప్రేమలో మగ్నమైన మీరా అంతటా కృష్ణుడినే చూస్తోంది. అంతటా కృష్ణప్రేమే! ఆ ప్రేమకు అవధులు లేవు. అంతటా ఆనందమే! బ్రహ్మానందమే!”

**తాత మాత బ్రాత బంధు ఆపణో న కోయీ।**

**ఛాడ్‌గయీ కుల్ కి తాన్ కా కరి హే కోయీ॥**

“నాకు తల్లిదండ్రులు సోదరులు బంధువులు ఎవ్వరూ ఇక లేరు. ఈ బంధాలన్నీ త్రెంచివేశాను. నా కృష్ణుడు నాకు అండగా దండగా వుండగా నన్నేమి చేయలేరు. కృష్ణుడే నా సర్వస్వం అని త్రికరణ శుద్ధిగా నమ్మాను. నా స్వామి నన్ను ఏం చేయమంటే అది చేస్తాను. ఎలా వుండమంటే అలా ఉంటాను.”

“ప్రభూ! నీ కృపావిశేషములను వర్ణించలేక వేదాలు మూకీభావం వహించాయి. ఐదేళ్ల బాలుడైన ధృవునికి దర్శనం ఇచ్చావు. అంబరీషుడిని రక్షించావు. శబరి ఇచ్చిన ఎంగిలి పళ్లను భుజించావు. కర్మాబాయి పెట్టిన ఖిచడీ (పొంగలి)ని ఆప్యాయతతో ఆరగించావు. నీదాసి ఎప్పుడూ నీ స్మరణలోనే ఉండి నిన్నే ధ్యానం చేస్తున్నది. నన్ను రక్షించటానికి ఎందుకు ఆలస్యం చేస్తున్నావు? నన్ను ఏల రక్షించవు?”

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL